


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


**గిల్ సూపర్ సెంచరీ... ఐపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లిన గుజరాత్...**





ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 144 | శనివారం 30 - 05 -2026 | పేజీలు : 12 | No: KNL/3-77(D)/2026-2028 | వెల-3


## ఇరాన్‌తో ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోబోతున్నాం: ట్రంప్



- ఇరాన్ అణ్వాయుధాలను ఎప్పటికీ కలిగి ఉండరాదని స్పష్టం
- హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని డిమాండ్
- ఒప్పందంలో ఎలాంటి నగదు లావాదేవీలు ఉండవని వెల్లడి
- ఈ పరిణామాలు భారత్ ఇంధన భద్రతకు అత్యంత కీలకం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో ఒక కీలక ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోబోతున్నట్టు సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయబోమని హామీ ఇవ్వడంతో పాటు, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం వంటి కఠిన

# ఏపీలో రూ.22 వేల కోట్లతో భారీ విద్యుత్ కారిడార్..



- రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు ప్రతిపాదనలు
- 18 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేలా ప్రణాళిక
- ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశం
- పీఎం సూర్యఘర్ పథకంలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని సీఎం సూచన
- రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో కలిసి పనిచేయాలని నిర్ణయం

ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడంతో పాటు, దానిని సమర్థంగా గ్రిడ్‌కు అనుసంధానించేందుకు భారీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా, సుమారు రూ.22 వేల కోట్ల వ్యయంతో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3' నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ శాఖ పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్, విద్యుత్ సరఫరా, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలు పురోగతిపై విస్తృతంగా చర్చించారు.గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద చేపట్టనున్న చర్యలపై సీఎం ఆరా తీయగా, అధికారులు పూర్తి వివరాలు అందించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే 18 గిగావాట్ల హరిత విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఇందులో 11 గిగావాట్ల సౌర విద్యుత్, 7 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఉంటుందని వివరించారు. ఈ కారిడార్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,261 కిలోమీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు, 9,500 మెగావాట్ల సామ ర్థ్యం తో ముదిగుబ్బ, తలుపుల, రామాయ పట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో ఐదు భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్లు తెలిపారు.

## ప్రతి ఓటును కాపాడుకోవాలి



- ఎస్ఐఆర్ సమయంలో అనుసరించాల్సిన తీరుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్
- హాజరైన మీనాక్షి నటరాజన్ తదితర నేతలు
- బెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారన్న మహేశ్ గౌడ్

## డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు, ఢిల్లీ పెద్దల వద్ద సిద్ధరామయ్య సరికొత్త ప్రతిపాదన!



- ప్రభుత్వం, పార్టీకి సమన్వయ కమిటీని వేయాలని విజ్ఞప్తి
- తనకు ఛైర్మన్ బాధ్యతలు అప్పగించాలని సిద్ధరామయ్య ప్రతిపాదన
- 2018లో కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వ హయాంలో ఛైర్మన్‌గా వ్యవహరించిన సిద్ధరామయ్య

# మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డులు లేకుండా చేస్తాం



- గుంటూరు, విశాఖలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఉన్నాయన్న నారాయణ
- 107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడి
- వైసీపీ ప్రభుత్వం 150 లక్షల చెత్తను వదిలిపోయిందని విమర్శ

# మహానాడు విజయాన్ని అందరికీ అంకితం చేస్తున్నా: నారా లోకేశ్

- విజయవంతంగా ముగిసిన టీడీపీ మహానాడు
- తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత జరిగిన తొలి మహానాడు అన్న లోకేశ్
- టీడీపీ టీమ్ కృషి వల్ల మహానాడు విజయవంతం అయిందన్న లోకేశ్



## కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు... రాహుల్ గాంధీతో షర్మిల భేటీ



- భేటీలో షర్మిల భర్త అనిల్ కుమార్, కేసీ వేణుగోపాల్
- కర్ణాటక నుంచి రాజ్యసభ సీటు కోరుతున్నట్లు కథనాలు
- వైఎస్ఆర్టీపీని విలీనం చేసిన సమయంలో రాజ్యసభ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం

## 'రియల్' మాఫియా!



- రాజాంలో ఆందోళన చేస్తున్న బాధితులు
- నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు
- ఒక్కో స్థలాన్ని ఇద్దరు ముగ్గురికి రిజిస్ట్రేషన్
- జిల్లాలో పెరుగుతున్న మోసాలు
- రాజాంలో రూ.60లక్షలు నష్టపోయిన బాధితులు
- అధికారులే న్యాయం చేయాలని వేడుకోలు

# జగన్ పీఏ అక్రమ సొమ్ము విదేశాలకు?

**మొదట దుబాయ్.. తర్వాత యూఎస్‌కు గుట్టు బయటపెట్టిన కేఎన్‌ఆర్ ఆత్మీయ మిత్రుడు తెలిదంటూనే క్లూ ఇచ్చిన పుత్తా శివశంకర్ రెడ్డి**



వైసీపీ అధినేత జగన్ పీఏ కె.నాగేశ్వర రెడ్డి(కేఎన్ఆర్) వందల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించినట్టు సిట్ విచారణలో వెల్లడైన విషయం తెలిసిందే. ఆయన ఆస్తులు ఇప్పటి వరకూ మూడు రాష్ట్రాల్లో బయటపడ్డాయి. అక్రమ సొమ్మును విదేశాలకు కూడా తరలించి పెట్టుబడులు పెట్టినట్టు తాజా విచారణలో వెలుగు చూసింది. కడప జిల్లా కమలాపురం ప్రాంతానికి చెందిన కేఎన్ఆర్ చిన్ననాటి స్నేహితుడు, తాను అరెస్టైతే తన స్థానంలో జగన్‌కు సేవలందించేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా తాడేపల్లికి తెచ్చి పెట్టుకున్న పుత్తా శివశంకర్ రెడ్డి (పీఎస్ఆర్)ని సిట్ అధికారులు ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రశ్నించారు. కేఎన్ఆర్ ఆర్థిక వ్యవహారాలు తనకు తెలియవంటూ మొదట్లో చాలా జాగ్రత్తగా అతడు చెప్పాడు. అయితే సిట్ అధికారులు మధ్యలో చాకచక్యంగా అడిగిన కొన్ని ప్రశ్నలకు విదేశీ పెట్టుబడులపై నోరు జారినట్లు తెలిసింది. విదేశాల్లో బంధువుల పేరుతో కేఎన్ఆర్ పెట్టుబడులు, దుబాయ్ మీదుగా యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీకి సొమ్ములు చేరడంపై చూచాయగా చెప్పినట్లు తెలిసింది.

## పులి సంచారంపై నిరంతర పర్యవేక్షణ



పోలవరం జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారంపై ప్రజలు, అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులి కదలికలపై ఆధునిక సాంకేతకతతో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలను అందుబాటులో ఉంచాలన్నారు. పోలవరం జిల్లా చికిలింత పంచాయతీలో పులి దాడిలో 9 దూడలు మృతి చెందటం పట్ల పవన్ విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్‌లో పులి కదలికలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ పశువులు, మనుషులకు ఎలాంటి హాని కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, 24గంటలూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

నంది పత్రిక

శనివారం 30 - 05 -2026

# ఏపీలో రూ.22 వేల కోట్లతో భారీ విద్యుత్ కారిడార్.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దానికి అనుగుణంగా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కారిడార్ పూర్తయితే రాష్ట్రంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు నిరంతరాయ విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని, తద్వారా భారీ పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును కాలపరిమితితో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**పీఎం సూర్యఘర్ అమలులో వేగం పెంచాలి** ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో ఏపీ ప్రస్తుతం దేశంలో నాలుగో స్థానంలో ఉందని, అగ్రస్థానానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని, మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు రూ.20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు బిగించే లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై 200 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే పనులు వేగవంతం చేయాలన్నారు. రెస్కో మోడల్‌లో, నెట్ మీటరింగ్ విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. అలాగే, 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో 'నెట్ జీరో' విధానంలో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

**సాంకేతికతతో విద్యుత్ నష్టాలకు చెక్** దేశంలోనే తొలిసారిగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ్' సంస్థ సహకారంతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ద్వారా 'డిజిటల్ ట్విన్ గ్రిడ్' రూపొందిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని గుర్తుచేశారు.

**సీఎంతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం భేటీ** సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ప్రతినిధుల బృందం భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్' (జ4×=) కార్యాచరణపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి అంశాలపై ఈ కేంద్రం అధ్యయనం చేయనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులను జ4×= కార్యాచరణతో అనుసంధానం చేయాలని, ఫలితాలు సాధించేలా పనిచేయాలని ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే స్థాయికి ఎదగాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డులు లేకుండా చేస్తాం: నారాయణ

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను డంపింగ్ యార్డులు లేని పట్టణాలుగా మార్చేందుకు యత్నిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ చెప్పారు. ప్రస్తుతం గుంటూరు, విశాఖలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. మరో ఆరు ప్లాంట్లను నెలకొల్పబోతున్నామని వెల్లడించారు. ఈలోగానే 107 మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చెత్తను బయోగ్యాస్, కంపోస్ట్ గా మారుస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు చేసిందని... అయినా 150 లక్షల చెత్తను వదిలిపోయిందని నారాయణ విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం వదిలేసిన చెత్తను తాము తొలగిస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీల చెత్తను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వ్యర్థాల నుంచి కూడా సంపద సృష్టించడం కూటమి ప్రభుత్వ విధానమని చెప్పారు.

# మహానాడు విజయాన్ని అందరికీ అంకితం చేస్తున్నా: నారా లోకేశ్

తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహానాడు నిన్న విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పందిస్తూ... మహానాడు విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. కోట్లాది మంది టీడీపీ కుటుంబ సభ్యుల ఆశీస్సులతో తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యానని... తాను ఈ పదవిని చేపట్టిన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని అన్నారు. టీడీపీ టీమ్ కృషి వల్ల మహానాడు విజయవంతం అయిందని చెప్పారు. మహానాడు 2026 విజయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, మీణూ, ×ుణూ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ అంకితం చేస్తున్నానని తెలిపారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని చెప్పారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడును ప్రధాని మోదీ పిలుపుతో, అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని లోకేశ్ తెలిపారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవడాన్ని చంద్రబాబు మనకు నేర్పారని... ఆ నేర్పును హైబ్రిడ్ మహానాడుకు ఉపయోగించి విజయవంతం చేశామని చెప్పారు. ఇప్పుడు ప్రతి ఇల్లు, ప్రతి పల్లె మహానాడుకు వేదిక అయిందని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయిందని... ఇది మహానాడు సాధించిన మరో ఘన విజయమని చెప్పారు.

# జగన్ పీఏ అక్రమ సొమ్ము విదేశాలకు?

## కేఎన్ఆర్‌ను అరెస్టు చేస్తే జగన్ సేవకు పీఎస్ఆర్

లిక్కర్ స్కామ్‌లో సిట్ అధికారులు జగన్ పీఏ కేఎన్ఆర్‌ను అరెస్టు చేస్తే.. ఆయన తాడేపల్లి ప్యాలెస్‌లో చేసే పనులన్నీ తాను చేసేందుకు సిద్ధమైనట్లు పుత్తా శివశంకర్ రెడ్డి వెల్లడించినట్లు తెలిసింది. ఒకే ఊరిలో పుట్టిపెరిగిన కేఎన్ఆర్, పీఎస్ఆర్ మంచి స్నేహితులు. సిట్ అధికారులు తనకు నోటీసు ఇచ్చిన రోజే తాడేపల్లిలో సజ్జల రామకృష్ణా రెడ్డి సహా మరికొందరు ముఖ్యులతో సమావేశమయ్యాడు. జగన్ వద్దకు శంకర్ రెడ్డిని సెట్ చేద్దామని అప్పుడే నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం పార్టీ నేతలతో జగన్ సమావేశమైనప్పుడు సీట్లో టవల్ సర్ది జగన్ చేతికి వాటర్ బాటిల్ అందించింది శంకర్ రెడ్డేనని సిట్ చూసిన విజువల్స్‌లో కనిపించింది. ఆస్తుల గుట్టు బయటపడేలోపు జగన్‌ను వదిలేసి కేఎన్ఆర్ విదేశాలకు వెళ్లిపోయే పథక రచన ఏమైనా చేశాడా అనే కోణంలో సిట్ ఆరా తీస్తోంది. జగన్ పీఏతో తనకు ఎలాంటి ఆర్థిక లవాదేవీలు లేవని చెప్పిన పీఎస్ఆర్‌ను లావాదేవీల రికార్డులతో ఆడిటర్‌ను వెంట తీసుకురావాలంటూ సిట్ అధికారులు చెప్పినట్లు తెలిసింది. మరోవైపు శుక్రవారం విచారణకు హాజరు కాని లక్కీ హ్యుందాయ్ కార్ల షోరూమ్ భాగస్వామిని సైతం ఆడిటర్‌తో కలిసి రావాలంటూ సిట్ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

# యువ షూటర్ ఈషా సింగ్‌కు తెలంగాణ క్రీడాశాఖ అభినందనలు

జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ షూటింగ్ పోటీల్లో తెలంగాణకు చెందిన యువ షూటర్ ఈషా సింగ్ మరోసారి తన ప్రతిభను చాటుకుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రజత పతకం సాధించిన ఈషా, ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో రెండు వ్యక్తిగత పతకాలు గెలిచిన తొలి భారత మహిళా షూటర్‌గా చరిత్ర సృష్టించింది. ఇప్పటికే ఈ టోర్నీలో స్వర్ణ పతకంతో పాటు ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఈషా సింగ్, మరోసారి అద్భుత ప్రదర్శనతో దేశానికి, తెలంగాణకు గర్వకారణంగా నిలిచింది. అదే విభాగంలో భారత షూటర్ సురుచి ఫొగాట్ స్వర్ణ పతకం సాధించడంతో భారత్‌కు డబుల్ విజయోత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఈషా సింగ్‌ను అభినందించారు.

# రియల్ మాఫియా!

– నెలకు రూ.2 వేలు ..60 నెలలు కడితే చాలూ. ప్లాట్ మీ సొంతం అవుతుంది. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఇదే మంచి అవకాశం అంటూ వచ్చిన ప్రకటన వారిని ఆకర్షించింది. వెనుకా ముందు చూసుకోకుండా.. వివరాలేవీ ఆరా తీయకుండా వంగర మండలం కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన 50 మంది రూ.1.20 లక్షల చొప్పున రాజాంకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ముట్టజెప్పారు. మొత్తం రూ.60 లక్షలు కట్టగా ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి బోర్డు తిప్పేశాడు. మోసానికి గురయ్యామని తెలుసుకుని ఈ నెల 27 బాధితులంతా ఆందోళనకు దిగారు. పోలీసులు కలుగజేసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. లేకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని అంటున్నారు.– రాజాం పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఒక ప్లాట్‌ను రూ.3 లక్షలకు కొనుగోలు చేశాడు ఓ వ్యక్తి. విద్యుత్, కాలువలు, తాగునీరు వంటి సౌకర్యాలు ఉన్నాయంటూ నమ్మబలికిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పూర్తిస్థాయి నగదు తీసుకున్నాడు. పది సంవత్సరాలు అవుతున్నా ఆ వెంచర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించలేదు.రాజాం, మే 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. అనుమతులు సులభతరం చేయడంతో కొత్తగా అనేక రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా స్థలాలను విక్రయిస్తూ ప్రజలను మోసగిస్తున్న కేసులు సైతం అధికమవుతున్నాయి. పట్టణాభివృద్ధి సంస్థల నుంచి అనుమతులు తీసుకొని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా)లో రిజిస్ట్రేషన్ కానివారు చాలా మంది ఉన్నారు. కొందరైతే ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే నిబంధనలకు విరుద్ధంగా స్థలాలను విక్రయించేస్తున్నారు. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, రాజాంతో పాటు ఎస్.కోట, కొత్తవలసలో ఇటువంటి మోసాలు అధికంగా ఉన్నాయి.

**అనుమతులు లేనివే ఎక్కువ..** నగరాలు, పట్టణాల్లో రియల్ ఎస్టేట్ కార్యాలయాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొందరి నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని ఈఎంఐల రూపంలో సైతం మోసాలకు తెరలేపుతున్నారు. జిల్లాలో ఏటా 100 వరకూ రియల్ ఎస్టేట్ వెంచర్ల వేస్తుండగా.. అందులో సగానికిపైగా ప్రభుత్వ అనుమతులు లేనివే ఉంటున్నాయి. కూటమి ప్రభుత్వం సింగిల్ విండో తరహాలో అనుమతులు ఇస్తోంది. ఆపై రియల్ వెంచర్లలో రోడ్ల వెడల్పును 12 అడుగుల నుంచి 9 అడుగులకు తగ్గించింది. అయినా అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడడం లేదు. చిరుద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకూ.. సాధారణ రైతు కూలీ నుంచి కార్మికుడు వరకూ.. చిరు వ్యాపారి నుంచి పెద్ద స్థాయి వ్యాపారి వరకూ తమ ఆదాయంలో కొంత మొత్తాన్ని ఎక్కువగా ఇంటి స్థలాలపైనే పెడుతున్నారు. ఇటువంటి వారు కనీస నిబంధనలు పాటించని రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద స్థలాలను కొనుగోలు చేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిపై ఎటువంటి బ్యాంకు రుణాలు అందడం లేదు. పైగా ఒక్కో స్థలాన్ని ఇద్దరు ముగ్గురికి సైతం రిజిస్ట్రేషన్లు చేసి మోసం చేస్తున్నారు. దీంతో కొనుగోలుదారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అందుకే రియల్ ఎస్టేట్ వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది..

**వీటిని గమనించుకోవాలి..**– పట్టణాభివృద్ధి సంస్థల నుంచి అనుమతి, ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ తొథారిటీ (రేరా) రిజిస్ట్రేషన్లు చేసుకున్న లేఅవుట్లలోనే స్థలాలను కొనుగోలు చేయాలి.– ప్లాట్లు విక్రయించే వ్యాపారుల నుంచి లేఅవుట్ నమూనా పత్రం తీసుకొని సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలోని ప్రణాళికా విభాగంలో సంప్రదించి నిర్ధారించుకోవాలి.– రేరా వెబ్‌సైట్‌ను పరిశీలించడం ద్వారా ప్రాజెక్టుకు రిజిస్ట్రేషన్ ఉందో? లేదో? తెలుసుకోవచ్చు.– కనీసం పదేళ్లకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) తీసుకోవడం ద్వారా స్థలంపై బ్యాంకు రుణాలు, కేసులు ఉన్నాయా? లేదా? అనేది తెలుస్తుంది.– లేఅవుట్లలో రోడ్లు, కాలువలు, నీటి సౌకర్యం ఇతర మౌలిక సదుపాయాలు పరిశీలించాలి.

**– బ్యాంకింగ్ మార్గంలో డబ్బులు చెల్లించి రశీదు తీసుకోవాలి.**

**రెక్కల కష్టంతో కట్టాం..** నేను విశాఖలో కాయాకష్టం చేసుకొని నెలకు రూ.2,500 చొప్పున రాజాంలోని సాయి చైతన్య రియల్ ఎస్టేట్ సంస్థ చైర్మన్ సీర నారాయణరావుకు ఈఎంఐలు చెల్లించా. సొంతిల్లు కట్టుకోవచ్చని చెప్పి రూ.1.50 లక్షలు ముట్టజెప్పా. ఇప్పుడేమో నాకు కేటాయించిన ప్లాటు వేరొకరికి రిజిస్ట్రేషన్ అయి ఉంది. ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదు. నాలాంటి బాధితులు చాలామంది ఉన్నారు. అధికారులే మాకు న్యాయం చేయాలి. **కర్రి ఉమామహేశ్వరరావు, బాధితుడు, కొండచాకరాపల్లి**

# జగన్ పీఏకి అన్ని కోట్లు ఎలా వచ్చాయి?: పట్టాభి

### లిక్కర్ కుంభకోణంలో వైసీపీ నేతలు దోచుకున్నారన్న పట్టాభి

### అన్ని వేళ్లు తాడేపల్లి ప్యాలస్ వైపే చూపిస్తున్నాయని వ్యాఖ్య

### జగన్ పీఏకు మూడు రాష్ట్రాల్లో ఆస్తులు ఉన్నాయని ఆరోపణ

వైసీపీ నేతలపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ నేత పట్టాభి తీవ్ర విమర్శలు గుప్పించారు. లిక్కర్ కుంభకోణంలో వైసీపీ నేతలు కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ఈ స్కామ్ లో వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలస్ వైపు చూపిస్తున్నాయని చెప్పారు. గొడ్డలి పార్టీకి కూడా పీ4 పథకం ఉందని... అదేంటంటే 'పవర్, ప్రాపర్టీ, పైసా, పార్టనర్ షిప్' అని అన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచుకోవడమే గొడ్డలి పార్టీ పీ4 పథకం అని చెప్పారు. జగన్ పీఏ నాగేశ్వరరావు (కేఎన్ఆర్) భార్య ఖాతాలోకి 2019-24 మధ్య కాలంలో రూ. 20 కోట్లు వచ్చాయని ఆరోపించారు. ఒక సాధారణ పీఏ భార్య ఖాతాలోకి అన్ని కోట్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. బెంగళూరుతో పాట పలు ప్రాంతాల్లో ప్లాట్లు ఎలా వచ్చాయని నిలదీశారు. జగన్ పీఏకు మూడు రాష్ట్రాల్లో ఆస్తులు ఉన్నాయని అన్నారు. మరోవైపు లిక్కర్ స్కామ్ లో కేఎన్ఆర్ ను సిట్ అధికారులు నిన్న ప్రశ్నించారు. నిన్న ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు విచారించారు.



# హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు... 'ఈగిల్ టీమ్' పేరిట విధులు

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన జీవనోపాధిని అందించి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములను చేసింది. ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు.

# ఇరాన్‌తో ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోబోతున్నాం: ట్రంప్

షరతులను శుక్రవారం ఆయన నిర్దేశించారు. ఈ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించిందా లేదా అనే దానిపై స్పష్టత ఇవ్వనప్పటికీ, తుది నిర్ణయం కోసం వైట్‌హౌస్‌లోని సిచ్యుయేషన్ రూమ్‌లో సమావేశమవుతున్నట్లు తెలిపారు.సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్టులో ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని లేదా బాంబును కలిగి ఉండరాదని ఈ ఒప్పందంలో భాగంగా అంగీకరించాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ ఇంధన సరఫరాలకు కీలకమైన హర్మూజ్ జలసంధిని ఎలాంటి రుసుములు లేకుండా, నౌకల రాకపోకలకు తక్షణమే తెరవాలని డిమాండ్ చేశారు. అమెరికా నావికాదళ దిగ్బంధనం కారణంగా జలసంధిలో చిక్కుకున్న నౌకలు ఇకపై తమ ప్రయాణాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. జలసంధిలో అమర్చిన మైన్‌లను ఇప్పటికే తొలగించామని, మిగిలిన వాటిని ఇరాన్ తొలగిస్తుందని పేర్కొన్నారు.సుమారు 11 నెలల క్రితం అమెరికా బీ2 బాంబర్ దాడి వల్ల పర్వతాల కింద కూరుకుపోయిన 'అణు ధూళి'గా పేర్కొంటున్న ఇంధన పదార్థాన్ని వెలికితీసి నాశనం చేస్తామని ట్రంప్ తెలిపారు. ఈ ఆపరేషన్‌ను ఇరాన్, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) సహకారంతో అమెరికా నిర్వహిస్తుందని వివరించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎలాంటి నగదు లావాదేవీలు ఉండవని ట్రంప్ స్పష్టం చేశారు. అంతగా ప్రాధాన్యం లేని ఇతర అంశాలపై అంగీకారం కుదిరిందని చెప్పినప్పటికీ, వాటి వివరాలను వెల్లడించలేదు. హర్మూజ్ జలసంధికి సంబంధించిన ఏ పరిణామమైనా ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా, భారత్ తన ముడి చమురు అవసరాలలో ఎక్కువ భాగాన్ని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటున్నందున, ఇక్కడ జరిగే పరిణామాలు దేశ ఇంధన భద్రత, రవాణా ఖర్చులు, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరే ఏ ఒప్పందమైనా భారత్‌కు అత్యంత కీలకం కానుంది.

# డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు, ఢిల్లీ పెద్దల వద్ద సిద్ధరామయ్య సరికొత్త ప్రతిపాదన!

కర్ణాటకలో అధికారం చేతులు మారుతోంది. సిద్ధరామయ్య ఇప్పటికే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. డీకే శివకుమార్ త్వరలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సీఎం పదవిని వదులుకోవడానికి ముందు నుంచి సిద్ధరామయ్య ఇష్టపడటంలేదు. కానీ అధిష్ఠానం ఒప్పించడంతో ఆయన రాజీనామా చేశారు. డీకే శివకుమార్ బాధ్యతలు స్వీకరించడానికి ముందే... పార్టీలో ఆధిపత్యం కోసం అలాగే, రేపు ఆయన సీఎం అయ్యాక పాలనపరంగానూ తమ పట్టు నిలుపుకునేందుకు సిద్ధరామయ్య ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నిన్న రాజీనామా చేసిన అనంతరం సిద్ధరామయ్య తన కుమారుడితో కలిసి ఢిల్లీకి చేరుకున్నారు. ఈరోజు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ముఖ్య నాయకుడు రాహుల్ గాంధీని కలిసి తన కుమారుడికి కీలకమైన శాఖలు అప్పగించాలని కోరారు. తాజాగా ఆయన అధిష్ఠానం ముందు మరో కీలక ప్రతిపాదన ఉంచారు.కర్ణాటక ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ మధ్య సమన్వయం చేయడానికి ఒక కోఆర్డినేషన్ కమిటీని వేయాలని, తనకు ఛైర్మన్ బాధ్యతలను అప్పగించాలని కాంగ్రెస్ పెద్దల ముందుకు ప్రతిపాదన తీసుకువెళ్లారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయ కమిటీ ఉంటే బాగుంటుందని సూచించారు. 2018లో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం హయాంలో సిద్ధరామయ్య సమన్వయ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో, ఇప్పుడు మరోసారి ఈ ప్రతిపాదనను తెరమీదకు తీసుకువచ్చారు. అయితే పార్టీకి సొంతగా మెజారిటీ ఉన్న నేపథ్యంలో సమన్వయ కమిటీ అవసరం లేదని అధిష్ఠానం చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

### ఆర్థికంగా మీ బలం ఎంత? ఈ 4 అంశాలతో చెప్పేయొచ్చు!

మనం ఆర్థికంగా ఎంత స్థిరంగా ఉన్నా, ఇంకా ఏదో సాధించలేదనే అసంతృప్తి చాలామందిలో ఉంటుంది. ఖరీదైన కార్లు, విలాసవంతమైన వస్తువులు లేకపోతే తాము ధనవంతులం కానట్టేనని భావిస్తుంటారు. కానీ, ఆడంబరాలతో సంబంధం లేకుండా కొన్ని సాధారణ అలవాట్లే నిజమైన ఆర్థిక భద్రతకు సంకేతాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మీరు అనుకున్నంతగా ధనవంతులు కాకపోయినా, చాలామంది భారతీయుల కంటే మెరుగైన స్థితిలో ఉన్నారనడానికి నాలుగు కీలక సూచికలు ఉన్నాయని నిపుణులు వివరిస్తున్నారు.

# కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు... రాహుల్ గాంధీతో షర్మిల భేటీ

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. ఇప్పుడు కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపీలో పార్టీని బలోపేతం చేయడానికి, రాజ్యసభలో కాంగ్రెస్ తరఫున ఏపీ గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది. రాహుల్ గాంధీతో భేటీ అనంతరం షర్మిల కారులో వెళుతుండగా మీడియా పలకరించింది. ఈ సమావేశంలో ఎప్పటిలా సాధారణ సమీక్ష జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఏపీ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీతో భేటీలో షర్మిలతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

# ప్రతి ఓటును కాపాడుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్

దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. పశ్చిమబెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారని.. బీజేపీ చేసిన కుట్రలతో అక్కడ ప్రభుత్వమే మారిపోయిందని మండిపడ్డారు. తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు.

# డీకే శివకుమార్ వర్సెస్ విజయ్.. ఇద్దరూ కోటీశ్వరులే..

భారత రాజకీయాల్లో సాదాసీదా ముఖ్యమంత్రుల శకం ముగిసిపోతున్నట్టు కనిపిస్తోంది. ఒకప్పుడు తెల్లటి కుర్తా, రబ్బరు చెప్పులతో నిరాడంబరంగా కనిపించేందుకే నేతలు ఇష్టపడేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. కొందరు తమ సంపదను, విలాసవంతమైన జీవనశైలిని ప్రదర్శించేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. ఈ కొత్త రాజకీయ ఒరవడికి తమిళనాడు నేత విజయ్, కర్ణాటక నేత డీకే శివకుమార్ ఉదాహరణలుగా నిలుస్తున్నారు.కర్ణాటకకు కాబోయే ముఖ్యమంత్రిగా ప్రచారంలో ఉన్న డీకే శివకుమార్ ఈ కొత్త ట్రెండ్‌కు నిలువుటద్దంలా కనిపిస్తారు. ఆయన తన విలాసవంతమైన జీవనశైలిని ఎప్పుడూ దాచుకోలేదు. ఖరీదైన గూచీ స్కార్ఫ్‌లు, లూయి విటన్ స్టోల్స్, రోలెక్స్, కార్టియర్ వంటి లగ్జరీ వాచ్‌లను ధరించి బహిరంగంగా కనిపిస్తారు. గతంలో తన వాచ్‌లపై విమర్శలు వచ్చినప్పుడు.. "నాకు నచ్చిన వాచ్ ధరించే హక్కు నాకు లేదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. 2023 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తుల విలువ రూ. 1,413.80 కోట్లు. రియల్ ఎస్టేట్, క్వారీయింగ్, విద్యాసంస్థల ద్వారా ఆయన భారీగా ఆస్తులు కూడబెట్టారు.

# మే 31న నంద్యాలలో 'సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన' 10వ వార్షికోత్సవ మహాసభ

### రాయలసీమ హక్కులు వికేంద్రీకృత అభివృద్ధి ప్రజాస్వామ్య పరిరక్షణే సభ లక్ష్యం
### బొజ్జా దశరథ రామిరెడ్డి

**నంద్యాల సిటీ బ్యూరో మే 29 ( నంది పత్రిక )** రాయలసీమ సాగునీటి హక్కులు, పాలనఅభివృద్ధి వికేంద్రీకరణ అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించిన చారిత్రాత్మక ఉద్యమ ఘట్టమైన "సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన" 10వ వార్షికోత్సవ మహాసభను మే 31, 2026న నంద్యాలలో నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి ప్రకటించారు. 2016 మే 31న ఉద్యమ నేపథ్యం లేని రాయలసీమలో "సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన" కార్యక్రమం ద్వారా ప్రజా ఉద్యమానికి బీజం వేసినట్లు ఆయన తెలిపారు. ఆ స్ఫూర్తితో గత పదేళ్లుగా రాయలసీమ సాగునీటి హక్కులు, ప్రాంతీయ అసమానతలు, పాలనఅభివృద్ధి కేంద్రీకరణ వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో ఉద్యమం విజయవంతమైందని పేర్కొన్నారు. రాయలసీమ సమస్యలపై పాలకులపై ఒత్తిడి తీసుకొచ్చే అనేక కార్యక్రమాలు చేపట్టినా, గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రాయలసీమకు న్యాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఆశయాలకు విరుద్ధంగా, వారి వారసులుగా వచ్చిన నారా చంద్రబాబు నాయుడు మరియు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు రాయలసీమ అభివృద్ధికి విఘాతం కలిగించే విధంగా వ్యవహరించాయని ఆరోపించారు. అలాగే, రాయలసీమకు 200 టి ఎం సీ ల అదరపు నికర జలాలను కేటాయిస్తామని రాయలసీమ డిక్లరేషన్ చేసిన భారతీయ జనతా పార్టీ కూడా తరువాత రాయలసీమ నీటి హక్కులను తెలంగాణకు మళ్లిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాంతాన్ని పావుగా ఉపయోగించుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.గత 12 ఏళ్లుగా ఏర్పడిన ప్రభుత్వాలు రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాలను విస్మరించి, తమ రాజకీయఆర్థిక సామ్రాజ్యాల నిర్మాణంపైనే దృష్టి పెట్టాయని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ మహాసభకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు.ప్రజాస్వామ్య హక్కులను గౌరవించే ప్రముఖులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఝాన్సీ లక్ష్మి, జస్టిస్ గోపాల గౌడ, ఆచార్య వెంకటేష్ తదితరులు ఈ సభలో పాల్గొని రాయలసీమ హక్కులు, సమగ్ర అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడిస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి విఘాతం కలిగించే విధంగా కొనసాగుతున్న కేంద్రీకృత పాలనకు ముగింపు పలుకుతూ, రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడిన రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పడే దిశగా ఈ మహాసభ ఒక వేదికగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని బొజ్జా దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ వాసులు, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక కార్యకర్తలు, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధిని కోరుకునే ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ఏర్వ రామచంద్రారెడ్డి, పట్నం రాముడు, ఆసదుల్లా, బాల ఈశ్వర్ రెడ్డి, మెహబూబ్ భాష, రాఘవేంద్ర, శివనాగిరెడ్డి, నిట్టూరి సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.




# పూడికతీత పనులు నాణ్యంగా పూర్తి చేయాలి

### కిందిభాగం వరకు చేపట్టకపోతే బిల్లులు నమోదు చేయొద్దు
### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగరంలో చేపడుతున్న పూడికతీత పనులు నాణ్యంగా చేపట్టాలని, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఏ.క్యాంపు, బి.క్యాంపు, గణేష్ నగర్ వద్ద సుద్దవాగు, సంకల్ బాగ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. 9వ డివిజన్‌లో మస్టర్ తనిఖీ నిర్వహించారు. అనంతరం ఎన్‌ఆర్ పేటలో కొనసాగుతున్న పూడికతీత పనులను తనిఖీ చేశారు. డ్రైన్ల కింది భాగం వరకు పూడికతీత పనులు చేపట్టకపోవడంపై అమినిటీస్ కార్యదర్శులపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూడికతీత పనులు పూర్తిచేయాలని, కింది భాగం వరకు పూడికలు తీయని పక్షంలో బిల్లులు నమోదు చేయవద్దని స్పష్టం చేశారు.అనంతరం కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు పాల్గొన్నారు.



# హైవే ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు



### రాత్రి వేళ ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక నిఘా
### రోడ్డు భద్రతపై అధికారులకు కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు

**ఆళ్లగడ్డ/నంద్యాల, మే 29(నంది పత్రిక):-** ఆళ్లగడ్డ పట్టణ పరిసర ప్రాంతాల్లోని జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా ఆదేశించారు. శుక్రవారం ఆళ్లగడ్డ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ చర్యల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్, ప్రాజెక్ట్ మేనేజర్ మదన్‌మోహన్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైవేలపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత డీఆర్‌ఎస్సీ సమావేశంలో సూచించిన చర్యల అమలుపై అధికారులు సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులకు సంబంధించిన ఫోటోలు, వివరాలను అందించాలని సూచించారు. హైవేలపై రేడియం లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై గత సమీక్ష సమావేశంలో సూచించినప్పటికీ ఇంకా లైటింగ్ ఏర్పాట్లు పూర్తి కాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాల్లో తక్షణమే రేడియం సైన్‌బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైవే పక్కన నిర్మాణంలో ఉన్న కల్యాణ మండప సముదాయాలకు క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే అనుమతులు జారీ కావడంపై కలెక్టర్ ప్రశ్నించారు. ప్రజల భద్రతకు భంగం కలగకుండా అన్ని అనుమతులు నిబంధనల ప్రకారమే ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట వాహనాలు నిర్లక్ష్యంగా నిలిపివేయడం, అనధికారికంగా ఏర్పడుతున్న దాబాలు కూడా ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని... ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు ఇప్పటికే కొన్ని అనధికార దాబాలను మూసివేసినట్లు తెలిపారు. ఈ తరహా అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. తిరుపతి వైపు నుంచి వచ్చే వాహనదారులు రాత్రి వేళల్లో నిద్రమత్తులో ప్రయాణించడం, రాంగ్ రూట్‌లో రావడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని నేషనల్ హైవే పిడి వివరించారు. ఈ నేపథ్యంలో హైవేలపై ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఆర్ అండ్ బి రోడ్డు - హైవే కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు, తగినంత లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన కొన్ని పనులు కోర్టు పరిధిలో ఉన్న కారణంగా నిలిచిపోయినట్లు పీడీ కలెక్టర్‌కు వివరించారు. రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# బస్సుల్లో సమిష్టి ప్రయాణం చేసిన జిల్లా అధికారులు


### "వన్ మంత్ - ఫోర్ విజిట్"లో ఇంధన పొదుపుకు వినూత్న చర్యలు
### ఇంధన వినియోగం తగ్గించడంలో నంద్యాల జిల్లా ప్రత్యేక చొరవపే లక్ష్యం : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, మే 29(నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా అమలు చేస్తూ, ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా అధికారులు సమిష్టిగా బస్సుల్లో ప్రయాణించడం ద్వారా వినూత్న సందేశాన్ని అందించారు. శుక్రవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ ఆవరణ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రతి ఒక్కరిలో ఇంధన పొదుపుపై చైతన్యం పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు సందేశం ఇవ్వడానికి ముందు అధికారులు స్వయంగా ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లా, డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు తమ వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, సమిష్టిగా మూడు బస్సుల్లో ప్రయాణించే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఇకపై "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఇదే విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంయుక్త తనిఖీలు, సమీక్షా సమావేశాలు, అధికారిక పర్యటనల సందర్భాల్లో అధికారులు విడివిడిగా వాహనాలు వినియోగించకుండా ఒకే వాహనంలో ప్రయాణించడం ద్వారా ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇటువంటి చర్యలు ప్రజల్లో కూడా ఇంధన పొదుపుపై మరింత అవగాహన పెంచేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప అనవసర ప్రయాణాలను తగ్గించాలని, ముఖ్యంగా సెలవు దినాల్లో వాహనాల వినియోగాన్ని పరిమితం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకే ఇంధనాన్ని వినియోగిస్తూ వృథా ఖర్చులను తగ్గించుకునే దిశగా ముందుకు రావాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు " కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం



### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు" కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శుక్రవారం ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గం మూడవ పర్యటన కు సంబంధించి ఓర్వకల్లు మండల కేంద్రంలోని శ్రీ జీవేశ్వర స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను శీఘ్రగతిన పరిష్కరించడం, రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా 'ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు" నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 70 శాతం సమస్యలు రెవెన్యూ సమస్యలే ఉంటున్నాయన్నారు. వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అప్పటికప్పుడు పరిష్కరించగలిగే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఒకవేళ వీలు కాకపోతే, ఆ సమస్య ఎప్పటికి పూర్తవుతుందో స్పష్టంగా తెలియజేస్తామన్నారు. పాణ్యం నియోజకవర్గంకు సంబంధించి గత రెండు వారాల్లో మొత్తం 485 అర్జీలు అందగా, వాటిలో 184 అర్జీలను ఇప్పటికే పరిష్కరించామని, మరో 301 అర్జీలు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఏ ఏ సమస్యలు పరిష్కరించబడ్డాయి, ఏవి పురోగతి లో ఉన్నాయనే వివరాలను బయట ప్రదర్శించామన్నారు.. అర్జీదారులు తమ దరఖాస్తు స్థితి, తీసుకున్న చర్యలను సులభంగా తెలుసుకునే విధంగా వివరాలు ఏర్పాటు చేశామన్నారు.. రీ-సర్వేకు సంబంధించిన సమస్యలపై అధిక సంఖ్యలో అర్జీలు ఇస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉన్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజలకు పూర్తి సంతృప్తి కలిగించే విధంగా పొరుగు భూముల యజమానులు మరియు అర్జీదారులకు నోటీసులు ఇచ్చి విచారణ చేపడుతున్నామన్నారు. అవసరమైతే మరోసారి సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.. అలాగే రోడ్లు, కాలువలు వంటి మౌలిక వసతుల కోసం కూడా ప్రజలు అర్జీలు ఇస్తున్నారని, వాటిని కూడా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అర్జీ దారుల నుండి అర్జీలను స్వీకరించి, ఆయా శాఖల అధికారులకు అందచేస్తూ, అర్జీలను వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఒక నెల ఒక నియోజకవర్గము నాలుగు పర్యటనలు కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇప్పటికే పాణ్యం నియోజకవర్గంలో రెండు పర్యటనలు పూర్తయ్యాయని, మూడవ పర్యటనను ఓర్వకల్లులో నిర్వహించుకుని ప్రజల నుండి అర్జీలను స్వీకరించడం జరుగుతోందన్నారు. అర్జీలను ప్రజలు సంతృప్తి చెందే విధంగా, వేగంగా పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# గ్రీవెన్స్‌ల పరిష్కారంపై శాఖల వారీగా కలెక్టర్ కఠిన ఆదేశాలు



### పెండింగ్ ఫిర్యాదుల క్లియరెన్స్‌కు వేగవంతమైన కార్యాచరణ

### "వన్ మంత్ - ఫోర్ విజిట్"కు ప్రజల నుండి విశేష స్పందన

### ప్రజలకు నేరుగా పరిష్కార పత్రాలు అందజేయాలి : కలెక్టర్ రాజకుమారి

**ఆళ్లగడ్డ/నంద్యాల, మే 29(నంది పత్రిక):–** ప్రజల నుండి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, జాప్యానికి తావులేకుండా తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. మొదటి వారం 578, రెండో వారం 524 ఫిర్యాదులు అందగా, ఈ వారం ఇప్పటివరకు దాదాపు 400 ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపారు. మొత్తం మూడు వారాల్లో సుమారు 1500 వరకు గ్రీవెన్స్‌లు అందినట్లు పేర్కొన్నారు. వీటిలో సుమారు 400 సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన పెండింగ్ అంశాలను కూడా చివరి వారంలో పూర్తిస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యమన్నారు. మొత్తం 33 శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారుల వారీగా విభజించి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం కల్లా ఆయా శాఖల అధికారులు ఆర్డీఓలతో కలిసి సమీక్షా సమావేశాలు నిర్వహించి, ఇప్పటివరకు పరిష్కరించిన సమస్యలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యలు పరిష్కారమైన లబ్ధిదారులను నేరుగా పిలిపించి, వెబ్‌ల్యాండ్ ధృవీకరణ పత్రాలు, ఎండార్స్‌మెంట్ కాపీలు తదితర ఆధారాలను వెంటనే అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తులను చిన్నచిన్న కారణాలతో తిరస్కరించకుండా, ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖలో 22ఏ డివిజన్లు, డాటెడ్ లైన్స్ క్లియరెన్స్, మ్యుటేషన్లు, రాస్తా సమస్యలు, ఇనాం పట్టా అంశాలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన 'అన్నదాత సుఖీభవ', ఎరువుల లభ్యత వంటి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్, పీడబ్ల్యూడీ, వాటర్ రిసోర్సెస్ శాఖలకు చెందిన మట్టి రోడ్లు, కల్వర్టులు, చిన్న వంతెనల నిర్మాణ ప్రతిపాదనలను త్వరితగతిన ప్రాసెస్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలీస్ శాఖ భూ వివాదాలను పెద్దల సమక్షంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈఓ మరియు సమగ్ర శిక్ష శాఖలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తాగునీరు, డెస్కులు, గ్రౌండ్ లెవెలింగ్ వంటి సమస్యలపై సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ బిల్లుల విడుదల, శానిటేషన్, తాగునీటి సమస్యలు, వైద్యుల కొరత వంటి అంశాలపైనా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ప్రజా గ్రీవెన్స్‌లను అధికారులు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతుందని, వచ్చే వారంలో కొత్త అర్జీల స్వీకరణకు పరిమిత సమయం కేటాయించి, ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఫీల్డ్ విజిట్ ఫోటోలు, లబ్ధిదారుల అభిప్రాయాలను సీఎం డ్యాష్‌బోర్డుకు పంపిస్తామని చెప్పారు. అధికారులు ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటే తన దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి ప్రజల నుండి సానుకూల స్పందన లభిస్తోందని, అధికారులు సమన్వయంతో పనిచేస్తే జిల్లా అభివృద్ధికి మరింత నిధులు సాధించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. చివరగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు మరియు అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




## ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారిని ఘనంగా సన్మానించిన.. వెల్లాల దంపతులు



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణములోని జెబి గార్డెన్ లో జరిగిన కర్నూలు జిల్లా కార్యవర్గ కార్యశాల ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారి నాయకత్వంలో జిల్లా అధ్యక్షులు రామకృష్ణ పర్యవేక్షణలో ఘణంగా నిర్విహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారు,బిజెవైయం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి పాల్గొన్నారు. అక్కమతోట రామకృష్ణ అధ్యక్షోపన్యాసము అనంతరం ముఖ్య అతిథులు సునీల్ రెడ్డి గారు, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారు ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ పార్థసారథి గారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా సాధిస్తున్న విజయాలతో పాటుగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు పేద మధ్యతరగతి ప్రజలకు ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలను వివరించడం జరిగింది. అంతేకాకుండా గత వైసిపి ప్రభుత్వములో జగనన్న కాలనీలో జరిగిన అవినీతిపై పోరాట ఫలితమే విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ వారు రైతులను కలిసి రిపోర్టు తయారు చేయడమే కాకుండా జగనన్న కాలనీలో అవినీతి జరిగిందని, పూర్తి విచారణ జరిపితే మరికొన్ని విషయాలు కూడా బయటకు వస్తాయని అలాగే ఆదోని నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాలలో రోడ్లు డ్రైనేజీలు 25కోట్ల అభివృద్ధి పనులు చేయడం జరిగిందని ఆదోని మున్సిపాలిటీ పరిధిలో కూడా వివిధ వార్డులలో 13 కోట్ల అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, మొన్నటికి మొన్న ధనాపురం నుండి హొలగుంద వరకు 7 కోట్ల రూపాయల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది, పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. అలాగే నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం 10 ఎకరాల భూమిని కేటాయించి ఎమ్ ఎస్ ఎంఈ పార్క్ ఏర్పాటు చేయడంతో పాటుగా నిరుద్యోగులకు వాళ్ళు ఏర్పాటు చేసే ఫ్యాక్టరీలను బట్టి స్థలాలను కేటాయించడం కోసం వినతులు కూడా తీసుకోవడం జరుగుతోందని వివరించారు. అనంతరం మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ దంపతులు ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి గారిని గజమాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమములో అమరావతి నగర్ 35వ బూత్ ఇంచార్జ్‌లు శ్రీమతి నూర్జహాన్, పరుశురాం,వీరేష్, చరణ్, లోకేష్ పాల్గొన్నారు..

# భూ సమస్యలకు పరిష్కారం





### ఇనాం, ప్రభుత్వ భూములను పట్టా భూములుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఒక్క నెల–ఒక నియోజకవర్గం–4 పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా రైతుల భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. ఇనాం భూమి నుంచి పట్టా భూమిగా మార్చాలని వచ్చిన దరఖాస్తులను, పట్టా భూమి ప్రభుత్వ భూమిగా మార్చారని వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి, ఓర్వకల్లు మండలానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి, సుబ్బారెడ్డి, రాంమోహన్ రెడ్డి అనే రైతులకు ప్రొసీడింగ్స్ ను కలెక్టర్ అందచేశారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఒక్క నెల–ఒక నియోజకవర్గం–4 పర్యటనలు' కార్యక్రమం క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలను ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 2 వ పర్యటన కు సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఇనాం భూమి నుంచి పట్టా భూమిగా మార్చాలని వచ్చిన దరఖాస్తులను,పట్టా భూమి ప్రభుత్వ భూమిగా మార్చారని వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వాటిని కరెక్షన్ చేసి ఇనాం, ప్రభుత్వ భూములను పట్టా భూములుగా మారుస్తూ ఉత్తర్వులను ముగ్గురికి ఇవ్వడం జరిగిందన్నారు.. ఈ విధంగా వచ్చిన అర్జీలలో ఏవైతే వెంటనే చేయగలమో వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు..ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ఆనందం వ్యక్తం చేసిన రైతులు సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్న కలెక్టర్ గారికి, ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి అనే రైతు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీ సర్వే ప్రక్రియ చేపట్టిన తర్వాత తన యొక్క సర్వే నంబర్ 208 పొలం ఇనాం భూములుగా నమోదయిందన్నారు. ఆ సమయంలో ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చిన ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని, చాలా కష్టాలు పడడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఒక్క నెల–ఒక నియోజకవర్గం–4 పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గంలో 2 వ పర్యటన జరిగిన సమయంలో దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, కలెక్టర్ గారి ఆదేశాల మేరకు అధికారులు వాటిని పరిశీలించి 4 రోజులలో తన యొక్క భూమిని పట్టా భూమిగా మారుస్తూ ఉత్తర్వులు అందచేయడం చాలా సంతోషంగా ఉందని రైతు నాగేశ్వర్ రెడ్డి తన యొక్క సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సర్వే నంబర్‌ను ఇనాం భూమి నుంచి తొలగించి, పట్టా భూమిగా మార్చి ఇచ్చినందుకు కలెక్టర్ గారికి, ప్రభుత్వానికి రైతు ధన్యవాదములు తెలిపారు.సుబ్బారెడ్డి, రామ్మోహన్ రెడ్డి అనే రైతులు మాట్లాడుతూ ఓర్వకల్ మండలంలో ఉన్నటువంటి తమ యొక్క భూములను ప్రభుత్వ భూముల కింద పెట్టారని, గత ఐదేళ్లుగా ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ కూడా సంబంధిత సమస్యను పరిష్కరించలేదని రైతులు తెలిపారు.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఒక్క నెల–ఒక నియోజకవర్గం–4 పర్యటనలు' కార్యక్రమంలో రెవెన్యూ భూ సమస్యలను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నారని తెలుసుకొని.. పాణ్యం నియోజకవర్గం రెండవ పర్యటనలో భాగంగా అర్జీ ఇవ్వడం జరిగిందని అర్జీ ఇచ్చిన వెంటనే కలెక్టర్ గారి ఆదేశాల మేరకు అధికారులు తమ యొక్క సమస్యను వెంటనే పరిష్కరించి ఈరోజు ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు.. ప్రభుత్వం ఇటువంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా ఎటువంటి భూ సమస్యలు లేకుండా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు..కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఓర్వకల్లు తహసిల్దార్ విద్యా సాగర్, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్ అమలులో జిల్లా ఆదర్శంగా నిలవాలి

### ప్రతి ఇంటికి సౌర విద్యుత్ లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

### గ్రామీణ ప్రాంతాల్లో అవగాహనతో పాటు వేగవంతమైన అమలు అవసరం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**ఆళ్లగడ్డ/నంద్యాల, మే 29(నంది పత్రిక):–** జిల్లాలో సౌరశక్తి వినియోగాన్ని గ్రామస్థాయికి విస్తరించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ మరియు పీఎం కుసుం పథకాల అమలులో నంద్యాల జిల్లా రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని, ఇందుకోసం అధికారులు సమన్వయంతో వేగంగా పనిచేయాలని ఆమె సూచించారు. శుక్రవారం ఆళ్లగడ్డ ఎంపీడీఓ కార్యాలయంలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అమలవుతున్న పీఎం సూర్యఘర్ పథకం పనుల పురోగతిపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సౌరశక్తి వినియోగాన్ని గ్రామస్థాయిలో విస్తరించి ప్రజలకు దీర్ఘకాలిక విద్యుత్ భద్రత కల్పించడమే ప్రభుత్వ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్ అందిస్తున్నట్లు తెలిపారు. సాధారణ వర్గాల వారికి కూడా కిలోవాట్ ప్రాతిపదికన భారీ సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఒక కిలోవాట్ యూనిట్‌కు సుమారు 30 శాతం, రెండు కిలోవాట్లకు 60 శాతం, మూడు కిలోవాట్లకు 78 శాతం వరకు సబ్సిడీ లభిస్తోందని వివరించారు. మూడు కిలోవాట్ల సామర్థ్యం గల వ్యవస్థ సాధారణ గృహ అవసరాలకు సరిపోతుందని, దీని ద్వారా నెలకు 300 నుంచి 360 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. వినియోగదారులు ఉపయోగించిన తర్వాత మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించవచ్చుని, నెట్ మీటరింగ్ విధానం ద్వారా ప్రభుత్వం యూనిట్‌కు చెల్లింపులు చేస్తోందని వెల్లడించారు. ప్రారంభ దశలో ప్యానెల్స్, పైపులు, లైట్నింగ్ అరెస్టర్లు, స్ట్రక్చర్లు తదితర సామగ్రి సమయానికి అందుబాటులో లేకపోవడం వల్ల పనుల్లో కొంత ఆలస్యం జరిగినప్పటికీ ప్రస్తుతం సరఫరా మెరుగుపడుతోందని కలెక్టర్ తెలిపారు. సోలార్ వ్యవస్థల ఏర్పాటులో వినియోగదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కరెంట్ బిల్లుల ద్వారా ఆదా అయ్యే మొత్తాన్ని ఈఎంఐల రూపంలో చెల్లించే విధానం వల్ల వినియోగదారులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని చెప్పారు. రుణ చెల్లింపులు పూర్తయిన అనంతరం 20 నుంచి 25 సంవత్సరాల పాటు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ వ్యవస్థలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ ర్యాంకింగ్స్‌లో జిల్లా 7వ స్థానం నుంచి 3వ స్థానానికి చేరుకుందని, ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచే అవకాశముందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎంపిక చేసిన 12 గ్రామాల్లో ప్రతి ఇంటికి సౌరశక్తి అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని ఎస్పిడిసిఎల్ అధికారులను సూచించారు. మొదటి దశలో 100 మంది లబ్ధిదారులతో కార్యక్రమాన్ని ప్రారంభించి, ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఒక సంవత్సరంలో ఈ గ్రామాలను పూర్తిస్థాయి సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. విద్యుత్ లోడ్ పెంపు అవసరమైన ప్రాంతాల్లో డిస్కమ్స్‌తో సమన్వయం చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆళ్లగడ్డ పరిధిలో ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈ స్థాయి అధికారులతో ప్రత్యేక సమన్వయ బృందాన్ని ఏర్పాటు చేసి పనులను పర్యవేక్షించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పీఎం కుసుం పథకం కింద జిల్లాలో దాదాపు 39 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం రూ.180 కోట్ల మేర వ్యయ ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఇప్పటివరకు రూ.21 కోట్ల పనులు చేపట్టగా, మిగిలిన నిధులను తదుపరి దశల్లో వినియోగించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి: సీఎం చంద్రబాబు

"డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు శాఖను ఆదేశించారు. ఏళ్ల తరబడి కష్టపడి దాచుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచుకుంటుంటే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఈ పరిస్థితిని అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని సైబర్ నేర రహితంగా మార్చడమే లక్ష్యమని, ఏపీ ప్రజలను మోసం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని ఆయన హెచ్చరించారు. సచివాలయంలో సైబర్ నేరాల కట్టడిపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో సైబర్ నేరాలను సమూలంగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. దీనికి సంబంధించిన కార్యాచరణను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రికి వివరించారు. ఆరు స్తంభాల (6 పిల్లర్స్) ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్‌బోర్డ్, టెక్నాలజీ–ఏఐ వినియోగం, పోలీసులకు శిక్షణ, 3–టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటివి ఉంటాయని పేర్కొన్నారు. మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్'లో అత్యాధునిక సదుపాయాలతో రాష్ట్రస్థాయి సైబర్ వార్ రూం ఏర్పాటు చేస్తున్నామని, ఇది 30 రోజుల్లో అందుబాటులోకి వస్తుందని డీజీపీ తెలిపారు. సైబర్ మోసంపై ఫిర్యాదు అందిన వెంటనే 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, గోల్డెన్ అవర్ టైంలో స్పందించి బాధితుల డబ్బు బదిలీ కాకుండా చూడాలని సీఎం సూచించారు. ఇందుకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

పోలీసు పెట్రోలింగ్ తరహాలోనే 'సైబర్ పెట్రోలింగ్' కూడా నిరంతరం జరగాలని చంద్రబాబు అన్నారు. నేరం జరగకముందే ప్రజలను అప్రమత్తం చేయడంపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాలపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి వీబశ్రీవఎబత్‌వతీ.ూా× వంటి టెక్నాలజీలను వాడతామని, ఏడాదిలో 500 మంది పోలీసు అధికారులకు శిక్షణ ఇస్తామని డీజీపీ వివరించారు. 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు, 4 ప్రాంతీయ హబ్‌లు ఏర్పాటు చేసి నేరాలకు అడ్డుకట్ట వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది కోసం ప్రత్యేక ధ్యాన కార్యక్రమం...



**జీవనశైలిలో మెడిటేషన్ ఒక భాగం.. .**

**ధ్యానం శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది....**

**మూడురోజుల కార్యక్రమం సద్వినియోగం చేసుకోండి... .**

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ .**

నంద్యాల క్రైం, మే 29(నంది పత్రిక):- నంద్యాల జిల్లా పోలీసులు నిర్విరామంగా విధులు నిర్వహిస్తూ మానసిక ఒత్తిడికి గురికాకుండా, ప్రశాంతతతో తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు పోలీస్ అధికారులు ఒక ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నంద్యాల పట్టణ కేంద్రంలోని రామకృష్ణ పిజి కాలేజ్ ఆడిటోరియంలో పోలీసు సిబ్బంది కోసం "హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్" (ధ్యాన) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..24 గంటలు ప్రజల రక్షణ కోసం శ్రమిస్తూ తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న పోలీసులకు ఇటువంటి ధ్యాన మరియు యోగా కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ధ్యానాన్ని క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల జీవితంలో ఖచ్చితంగా సానుకూలత (పాజిటివ్‌నెస్) పెరుగుతుందని పేర్కొన్నారు. ఇటీవలి పరిశోధనల ప్రకారం, మెడిటేషన్ ద్వారా మన ఆలోచనా విధానాన్ని (థాట్ ప్రాసెస్ ) కూడా సానుకూలంగా మార్చుకోవచ్చని, దీనివల్ల అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని,అందరూ తమ దైనందిన జీవితంలో ధ్యానాన్ని ఒక భాగం చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి కుమారి ఎం. జావళి , అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) యుగంధర్ బాబు, రామకృష్ణ పిజి కాలేజ్ విద్యాసంస్థల అధినేత శ్రీ రామకృష్ణారెడ్డి , హార్ట్ ఫుల్ నెస్ సంస్థకు చెందిన యోగా టీచర్లు మరియు నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ధ్యాన ప్రక్రియలను అభ్యసించారు.



## వెంకాయ పల్లె ఎల్లమ్మ దేవతా దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు



కర్నూలు నంది పత్రిక బ్యూరో... కేడీసీసీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబాన్ని నమ్ముకున్న వారికి పదవులు ఖచ్చితంగా వస్తాయని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న వెంకాయ పల్లె ఎల్లమ్మ దేవతా దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలోని ఓ భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దస్తగిరి, కోడుమూరు నియోజకవర్గ తెదేపా, జనసేన నాయకులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ బీ.నాగేంద్ర ను ఎమ్మెల్యే దస్తగిరి సన్మానించి అభినందించారు. తనపై నమ్మకం తోఎంతో పేరు ఉన్న వెంకాయ పల్లె ఎల్లమ్మ దేవాలయం చైర్మన్ పదవి ఇచ్చినందుకు విష్ణు వర్ధన్ రెడ్డి కి, ఎమ్మెల్యే దస్తగిరికి నాగేంద్ర ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గం విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి జరుగుతున్నారు. ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధి కి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. అనంతరం. ఆలయం కమిటీ చైర్మన్ బి.నాగేంద్ర మాట్లాడుతూ విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబాన్ని నమ్ముకున్న వాళ్ళందరికీ పదవులు రావడం ఖాయమని ఆయన అన్నాడు. ఈ పదవి రావడం వల్ల రెడ్డికి రుణపడి ఉంటానని ఆయన తెలిపారు .నాకు చైర్మన్ రావడం వల్ల నాకు ఎంతో సంతోషం ఉందని ఆయన తెలిపారు ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అనురాధ, అరుణమ్మ, శారదా, ముత్యాల భాయ్, ఆంజనేయులు, వెంకట యోగాంజనేయ శర్మ, మనోహర్, పెద్ద వెంకటేశ్వర్లు, నాగరాజు, కే. శారదా, నారాయణ, నందనపల్లి కి చెందిన జనసేన సీనియర్ నాయకుడు దుర్గం బాలాజీ స్వామి .భారీ సంఖ్యలో అభిమానులు.కార్యకర్తలు పాల్గొన్నారు.



# పారిశుధ్యం పనులు అధికారులకు పట్టవా!





బండి ఆత్మకూరు నంది పత్రిక మే 29 :

ఏంటి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్లుగా అయింది ఆ గ్రామంలో మహిళల పరిస్థితి. వారం రోజులుగా గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టడం లేదు. మీ ఇంటి ముందు నుండి నీళ్లు పారుతున్నాయని ఒకరు, కాదు మీ ఇంటి ముందర ఉన్న మురుగునీళ్లే మా ఇంటి మీదకు వస్తున్నాయని మహిళలు ఒకరినొకరు శాపనార్థాలు పెట్టుకుని సిగపట్లు పట్టుకునే పరిస్థితి ఏర్పడుతూ ఉంది. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలో ఈ పరిస్థితి నెలకొనింది. ఈర్నపాడు గ్రామం నుండి కడమల కాల్వ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో సిపిఎం రాముడి ఇంటి వద్ద వారం రోజుల నుండి మురుగునీళ్లు రోడ్డెక్కి పారు తూ ఉన్నాయి. కొందరు వ్యక్తులు కాలువకు ఒకవైపు ఉన్న డ్రైనేజీని పూర్తి వేశారని తెలుస్తోంది. ఈ కారణంగా మురుగునీళ్లు రోడెక్కి పారుతూ ఉండటంతో మహిళలు కీచులాడుకునే పరిస్థితి ఏర్పడింది. మురుగునీళ్లు రోడ్డుపై ప్రవహించి పాచి పట్టి పోయినప్పటికీ పట్టించుకోడే నాథుడే లేదని మహిళలు ఒకవైపు శాపనార్థాలు పెడుతూ, మరోవైపు ఘర్షణలకు పడే పరిస్థితులకు తెర లేపుకుంటున్నారు. ఈర్నపాడు గ్రామానికి 8 నెలలుగా రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి పదోన్నతి పై వెళ్లడంతో, పంచాయతీ శాఖ అధికారులు ఇన్చార్జిలతోనే పొద్దుపుచ్చుతున్నారు. నెలరోజుల క్రితమే లింగాపురం పంచాయతీ కార్యదర్శి సుబ్బారావును ఈ గ్రామానికి ఇన్చార్జిగా నియమించారు. అయితే పారిశుధ్యం విషయంలో ఇన్చార్జి కార్యదర్శి దృష్టి సారించకపోవడంతో పరిస్థితి మహిళలు గొడవపడేదాకా దారి చూస్తూ ఉంది. సర్పంచుల పదవీకాలం కూడా మూడు నెలల క్రితమే ముగిసిపోవడంతో వారి స్థానంలో బండి ఆత్మకూరు ఎంపీడీవో గాయత్రిని గ్రామానికి స్పెషల్ ఆఫీసర్గా నియమించారు. స్పెషలాఫీసర్ గా విధులు నిర్వహించడంలో ఎంపీడీవో అలసత్వం ప్రదర్శిస్తున్నారని మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రభుత్వం ప్రతి బుధవారం నాడు కార్యక్రమం మండల కేంద్రానికి పరిమితం అవుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల వైపు ఉన్నతాధికారులుదృష్టి సారించడం లేదని, ఈ కారణంగానే గ్రామాలలో పారిశుద్ధ పనులు ఎక్కుతున్నాయి. ఇకనైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ పనుల నిర్వహణలో పాలుపంచుకోవాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కుకింగ్ లో బి. కోడూరు మహిళకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి



బండి ఆత్మకూరు నంది పత్రిక మే 29: పులగం పచ్చడి చేసి రాష్ట్రస్థాయి కుకింగ్ నిర్వహణలో బండి ఆత్మకూరు మండలం బి. కోడూరు గ్రామానికి చెందిన నాగభూషణమ్మకు ప్రథమ బహుమతి లభించింది. విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కుక్ కం హెల్పర్స్ కు సంబంధించి రాష్ట్రస్థాయిలో రెండు రోజులపాటు జరిగిన శిక్షణలో ఆరు మంది మహిళలు నంద్యాల జిల్లా నుండి మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ట్రైనింగ్ కు హాజరు కావడం జరిగింది. రాష్ట్రస్థాయిలో కుకింగ్ నిర్వహణలో నిర్వహించిన కాంపిటీషన్లో బికోడూరు చెందిన నాగభూషణం ప్రథమ బహుమతి సాధించింది. నాగభూషణమ్మ పులగం పచ్చడి వంట చేసి నిర్వాహకుల చేత భేష్ అనిపించుకుని ప్రథమ బహుమతి సాధించారు. రాష్ట్రస్థాయి మధ్యాహ్న భోజన పథకం జాయింట్ డైరెక్టర్ గంగాభవానితోపాటు,విద్యాశాఖ ఉన్నతాధికారుల చేత ప్రశంసలు అందుకుని ప్రథమ బహుమతిని సాధించారు. ఆమెతోపాటు బండి ఆత్మకూరు మండలం పెద్దదేవలాపురం ఎంపీపీ ఎస్ పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్న ఈశ్వరమ్మకు కూడా అధికారుల చేత ప్రశంసలందుకొని బహుమతి పొందింది. ఈశ్వరమ్మ పాఠశాలలో వంట చేయడంతో పాటు స్వయంగా పిల్లలకు వడ్డించి పిల్లల ఆదరాభిమానాలను సంపాదించుకుంది. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన నాగభూషణమ్మ తో పాటు, ప్రత్యేక ప్రశంసలు అందుకున్న ఈశ్వరమ్మను మండల విద్యాశాఖ తరపున విద్యాశాఖ అధికారులు 1 యశోద,2 మోహన్ రెడ్డి తోపాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. నంద్యాల జిల్లా నుండి 6 మంది మహిళలు ఎంపిక కాగా, వారిలో ఇరువురు మహిళలు బండి ఆత్మకూరు మండలానికి చెందిన వారే బహుమతులు పొందడం విశేషం.

## దగా డీఎస్సీకి వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం ఆందోళన నిరసన కార్యక్రమం.



### అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించిన నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురేష్ యాదవ్...

నంద్యాల సిటీ బ్యూరో మే 29 ( నంది పత్రిక ) నంద్యాల జిల్లా కేంద్రములో మాజీ ముఖ్యమంత్రివర్యులు, వైఎస్సార్సీపీ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా అధ్యక్షులు లికాటసాని రాంభూపాల్ రెడ్డి వివిధ నియోజకవర్గ ఇంచార్జిల సూచనల మేరకు వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది... ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు సురేష్ యాదవ్ లి నాయకత్వం వహించారు...నంద్యాలలోని స్థానిక ఆర్ట్స్ కాలేజ్ నుండి బొమ్మలసత్రం ఫ్లైఓవర్ దగ్గర ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు...తదుపరి రాష్ట్ర ప్రభుత్వ డీఎస్సీ నియామకాలలో జరిగిన అవకతవకలు,నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ లి"దగా డీఎస్సీ"కి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు...ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సురేష్ యాదవ్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత ఆశలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు...డీఎస్సీ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం బాధాకరమని,విద్యార్థులు మరియు నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు... వైయస్సార్సీపీ రాజుజ మెంబెర్ సూర్య నారాయణ రెడ్డి మాట్లాడుతూ మెగా డీఎస్సీ కాదు కూటమి ప్రభుత్వం దగా డిఎస్సీ. యువత , విద్యార్థులు జీవితాలతో చేతకాని ప్రభుత్వం ఆడుకుంటున్నారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం జాబ్ ఫర్ సేల్ నడుస్తుంది. మరిన్ని రోజుల్లో ఆంధ్రప్రదేశ్ సీఎం కుర్చీలు కూడా అమ్మకానికి సిద్ధంగా ఉంది. ప్రశ్న పత్రాలు సిద్ధం చేయడానికి కూడా ప్రభుత్వ ఉద్యోగులు లేరా అని ప్రశ్నిస్తున్నాం. ఈ నిరసన కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డి , విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మని రెడ్డి , మాధురి గౌడ్ , జిల్లా ఉపాధ్యక్షులు సుమంత్ రెడ్డి , యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి , సన్నల సాయిరాం రెడ్డి,శ్రీశైలం విద్యార్థి విభాగం అధ్యక్షులు ధనుంజయ్ , పాణ్యం విద్యార్థి విభాగం అధ్యక్షులు సంతోష్ , బనగానపల్లె విద్యార్థి విభాగం అధ్యక్షులు జస్వంత్ రెడ్డి జిల్లాలో ఉన్న మండలం విద్యార్థి విభాగం అధ్యక్షులు,గ్రామ అధ్యక్షులు,విద్యార్థి విభాగం నాయకులు,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు...



## ప్రజలను సంతృప్తి పరిచేలా సేవలందించాలి

### - ఎంపీడీవో మేరీ



కొత్తపల్లి - నంది పత్రిక : గ్రామాలలో ప్రజలు సంతృప్తి వ్యక్త పరిచేలా అధికారులు సేవలందించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ భవనం నందు పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులకు సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమం ఏవిధంగా చేయాలి, ప్రభుత్వం నుంచి వచ్చే ఎంక్వైరీ పోన్కు ఏలా సమాదానం ఇవ్వాలి, ప్రజలనుంచి పింఛన్ పంపిణీ పై ఏలాంటి రెస్పాన్స్ వస్తుంది అన్న విషయాలను వారికి తెలియజేయాలన్నారు. అదేవిధంగా అక్షరాంధ్ర ఫేస్-2 కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఈకార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించే బాధ్యత ఎన్ఆర్ఆజీఎస్ సిబ్బంది. వెలుగుశాఖల సమన్వయంతో చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్వహించే ప్రతి సర్వేను పక్కాగా నిర్వహించాలని, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీప్యూటీ ఎంపీడీఓలు కె.పీ.ఆర్. శర్మ, సుబ్బారావులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాల పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ప్రత్యేక సవరణ ప్రక్రియ..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప,బ్యూరో చీఫ్ మే 29నందిపత్రిక** : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - సర్ 2026 ను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ & జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ - సర్ 2026 పై జేసీ డి. నిధి మీనా, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితాల సమగ్రత అత్యంత కీలకమని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితాలు అవసరమని, అందుకే భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.దేశవ్యాప్తంగా గతంలో పలు దఫాలు సర్ కార్యక్రమాలు నిర్వహించ బడ్డాయని, 2004 తర్వాత విస్తృత స్థాయిలో ఈ ప్రక్రియ జరగలేదని పేర్కొన్నారు. వేగవంతమైన పట్టణీకరణ, ఉద్యోగాలు, విద్య కోసం వలసలు పెరగడం, ఒకే వ్యక్తి పేరు పలుచోట్ల నమోదయ్యే అవకాశాలు, మరణించిన లేదా అనర్హుల పేర్లు కొనసాగుతున్నాయనే అంశాల నేపథ్యంలో ఓటరు జాబితాల సమగ్ర పరిశీలన అవసరమైందన్నారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకూడదనే దానితో పాటు, అనర్హుల పేర్లు జాబితాలో ఉండకుండా చూడడమేనని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గత ప్రత్యేక సమగ్ర సవరణలో నమోదైన వివరాలకు ప్రామాణికత కల్పించబడుతుందని చెప్పారు.ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరికి ముందుగా వివరాలు ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారమ్ (ఈ ఫ్ ) ఇవ్వబడుతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓ లు ఇంటింటికీ వెళ్లి ఫారమ్‌లను పంపిణీ చేసి, వాటిని తిరిగి సేకరిస్తారని చెప్పారు. ఓటరు ఇంటి వద్ద లేని పక్షంలో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ స్వీకరించేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.ఫారమ్ సమర్పించిన ప్రతి అర్హ ఓటరి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని, ఫారమ్ అందని వారి పేర్లు ముసాయిదాలో ఉండకపోవచ్చని తెలిపారు. అయితే ఎవరైనా పేరు తొలగించే ముందు తప్పనిసరిగా వినతులు స్వీకరించి విచారణ జరిపి మాత్రమే నిర్ణయం



తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు నియమించే బూత్ లెవల్ ఏజెంట్లు కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కోరారు. బి ల్ ఏ ఏస్ ద్వారా రోజుకు 50 వరకు ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించవచ్చని తెలిపారు. అలాగే క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల దశలో రోజుకు 10 వరకు దరఖాస్తులు ఇవ్వవచ్చని వివరించారు.కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6తో పాటు డిక్లరేషన్ ఫారం సమర్పించాలని చెప్పారు. పేరు తొలగింపుకు ఫారం-7, సవరణలు లేదా మార్పులకు ఫారం-8 ఉపయోగించాల్సి ఉంటుందని వివరించారు. ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ అనంతరం క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల ప్రక్రియ చేపడతామని తెలిపారు. అందిన అన్ని అభ్యంతరాలు, దరఖాస్తులు ఈఆ ర్ ఓ కార్యాలయ నోటీస్ బోర్డులలో, సీఈఓ వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడతాయని, ప్రతి వారం రాజకీయ పార్టీలతో కూడా పంచుకుంటామని చెప్పారు. గత సర్ లో నమోదైన వివరాలతో సరిపోలని సందర్భాల్లో విచారణ చేపట్టి అవసరమైతే పౌరసత్వం, నివాసం, జనన తేదీ వంటి అంశాలకు సంబంధించి ఆధారాలు పరిశీలిస్తామని తెలిపారు. అయితే ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రం మాత్రమేనని, అది పౌరసత్వం లేదా జనన తేదీకి పూర్తి ఆధారం కాదని ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న వారు, బలహీన వర్గాల ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక వాలంటీర్లను నియమించి అవసరమైన సాయం అందించనున్నట్లు తెలిపారు.తుది ఓటరు జాబితా ప్రచురణ అనంతరం కూడా అసంతృప్తి ఉన్నవారికి జిల్లా మేజిస్ట్రేట్ స్థాయిలో మొదటి అప్పీల్, అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి రెండో అప్పీల్ చేసే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేయగా, వాటిని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎస్.ఐ.ఆర్., ఎలాక్టోర్ రోల్ పబ్లిష్, తదితర అన్ని అంశాల్లో.. ప్రజలను తప్పుద్రోవ పట్టించే సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతలను నమ్మకుండా.. అన్ని పార్టీల ప్రతినిధులు.. ప్రజలకు, ఎలక్టోరల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని ఏ మాత్రం మిస్ అవ్వకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు డా. బి. శ్రీనివాసులు (ఆప్ ), ఎస్. గురప్ప (, బి ఎస్ పి,) జి.ఎస్.టి. లక్ష్మణరావు (బీజేపీ ),జి. చంద్రశేఖర్ (సీపీఐ ఎం), బి. పాల్ సుధాకర్ (ఐ ఎన్సి ) పి. విశ్వనాథ్ (జనసేన పార్టీ), వైఎస్ జబీవుల్లా (టీడీపి ), పి. సునీల్ కుమార్ (వైస్సార్సీపీ ) తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతిబ్యూరో చీఫ్ మే 29నంది పత్రిక** మహిళ సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ సాధనకు కృషి చేస్తున్నదని ఆయన చెప్పారు. 39వ డివిజన్ లోని చెన్నారెడ్డి కాలనీలో 40 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా స్వశక్తి భవనాన్ని, 40,41 వార్డులో సుమారు 18 లక్షలతో నిర్మించిన మస్టర్ రూమ్ ను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదాదేవి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు మెప్మా ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. మహిళా స్వశక్తి భవనాల ద్వారా డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి మహిళా సాధికారత కల్పనకు ప్రభుత్వం పెద్దపీఠ వేస్తోందని ఆయన చెప్పారు. మహిళల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ఈ భవనాలు ఎంతో ఉపయోగపడుతాయని ఆయన తెలిపారు. ఇంటికొక మహిళా పారిశ్రామిక వేత్తను తయారు చేసే లక్ష్యంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని ఆయన చెప్పారు. ప్రతి రోజు నగరాన్ని ఎంతో సుందరంగా ఉంచేందుకు కష్టిస్తున్న పారిశుధ్య కార్మికులు సేదతీరెందుకు మస్టర్ గది ఏర్పాటు చేశామని తెలిపారు. వారికి సంబందించిన పనిముట్లు ఉంచుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కారోబార్, బిల్ కలెక్టర్లకు జిఓ నెం.51 నుండి మినహాయింపు ఇవ్వాలి.

**మంత్రి సీతక్కను సచివాలయంలో కలిసిన జిపి ఉద్యోగ సంఘ నాయకులు.**

**తమ సమస్యల పరిష్కారంపై వినతిపత్రం అందజేత.**



**కేసముద్రం, మే 29(నంది పత్రిక)**:గ్రామ పంచాయతీ లలో పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్లకు జిఓ నెం.51 నుండి మినహాయింపు ఇవ్వాలని, గ్రామ పంచాయతీ ఉద్యోగులందరికీ ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ (సీతక్క)ని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలపై మంత్రితో చర్చించారు. ఈ మేరకు మంత్రి సీతక్క స్పందిస్తూ సీఎం ఏ.రేవంత్ రెడ్డి గ్రామ పంచాయతీ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని నాయకులకు గుర్తుచేశారు. సీఎం ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల చూపుతున్న చిత్తశుద్ధిని సంఘం నాయకులు స్వాగతించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్కకి తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు పిల్లి రవి యాదవ్, శ్రీధర్, సురేందర్, కందిపాటి నాగరాజు, కట్టయ్య, నేత నర్సయ్య, ఐలయ్య తదితరులు ఉన్నారు.

# ఏసీలు, కరెంట్ లేని కాలంలో చల్లదనం కోసం... రాజుల అద్భుతమైన టెక్నిక్స్!

దేశవ్యాప్తంగా తీవ్రమైన ఎండలతో ప్రజలు అల్లాడుతుండగా, ఏసీలపై భారం పెరిగిపోతోంది. ఇలాంటి సమయంలో, కరెంటు, ఏసీలు వంటి ఆధునిక సౌకర్యాలు లేని శతాబ్దాల క్రితం మన రాజులు, మహారాజులు తమ రాజభవనాల్లో వేసవి తాపాన్ని ఎలా తట్టుకున్నారనే విషయంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. వారి వాస్తు నైపుణ్యం, ప్రకృతిని వాడుకున్న తీరు నేటి ఇంజినీర్లకు సైతం స్ఫూర్తినిస్తోంది.భారత్‌లో 1930ల తర్వాతే ఏసీల వాడకం మొదలైంది. కానీ అంతకు ఎన్నో శతాబ్దాల ముందే మన రాజులు తమ నివాసాలను చల్లగా ఉంచుకోవడానికి అద్భుతమైన పద్ధతులు పాటించారు.

కోటల నిర్మాణానికి నదులు, సరస్సులు, కొండల సమీపంలోని ప్రదేశాలను ఎంచుకునేవారు. రాజభవన ప్రాంగణాల్లో ఫౌంటెయిన్లు, నీటి కాలువలు ఏర్పాటు చేసేవారు. వీటి నుంచి వచ్చే నీటి ఆవిరి, చల్లని గాలిని అందించి పరిసరాలను చల్లబరిచేది. కొన్ని కోటల్లో గోడల లోపల మట్టి పైపుల ద్వారా నీటిని నిరంతరం ప్రవహింపజేసి, రాతి కట్టడాల వేడిని తగ్గించేవారు. హంపిలోని లోటస్ మహల్, ఆగ్రా కోటలో ఇలాంటి నిర్మాణాలు కనిపిస్తాయి.

భవన నిర్మాణంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. మట్టి, సున్నపురాయి, ఇటుకలతో కట్టిన మందపాటి గోడలు పగటిపూట వేడిని నెమ్మదిగా గ్రహించి, రాత్రిపూట నెమ్మదిగా విడుదల చేసేవి. ఎత్తైన పైకప్పుల వల్ల వేడి గాలి పైకి వెళ్లిపోయేది. గాలి ప్రసరణకు వీలుగా విశాలమైన ప్రాంగణాలు, వరండాలు నిర్మించేవారు. సూర్యరశ్మి నేరుగా పడకుండా ప్రత్యేక నిర్మాణాలు, గాలిని అనుమతిస్తూ వెలుతురును వడపోసేందుకు 'జాలీ' కిటికీలు ఏర్పాటు చేసేవారు. జైపూర్‌లోని హవా మహల్ ఇందుకు చక్కటి ఉదాహరణ. కొన్నిచోట్ల పైకప్పులపై 'బాద్‌గిర్' అనే ప్రత్యేక నిర్మాణాలు ఏర్పాటు చేసి, బయటి చల్లగాలిని పట్టుకొని లోపలికి పంపేవారు.

నేడు విద్యుత్ వినియోగం, వాతావరణ మార్పులు పెను సవాళ్లుగా మారిన తరుణంలో, విద్యుత్ అవసరం లేని

ఈ "పాసివ్ కూలింగ్" పద్ధతులు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మన ఘనమైన వాస్తు వారసత్వాన్ని పునఃపరిశీలించడం ద్వారా నేటి సమస్యలకు సైతం పరిష్కారాలు కనుగొనవచ్చని ఈ నిర్మాణాలు గుర్తుచేస్తున్నాయి.

# టిపిటిఎఫ్ ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి దిక్సూచి లాంటిది.

**కేసముద్రంలో టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహణ.**

**పతాకావిష్కరణ చేసిన సీనియర్ ఉపాధ్యాయులు చీకటి వెంకట్రాం నర్సయ్య.**



**కేసముద్రం, మే 29(నంది పత్రిక)**:ప్రభుత్వ ఉపాధ్యాయులకు అందని ద్రాక్షలా మిగిలిపోతున్న పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని, ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న నూతన నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎలాంటి షరతులు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల కమిటీ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిపిటిఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టిపిటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, మండల కమిటీ నిర్మాణ బాధ్యులు, ఈనెలలోనే ఉద్యోగ విరమణ పొందుతున్న సీనియర్ ఉపాధ్యాయులు చీకటి వెంకట్రాం నర్సయ్య మండల కమిటీ నిర్ణయం మేరకు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గత నలభై సంవత్సరాలుగా టిపిటిఎఫ్ సంఘానికి సేవలు అందించి రిటైర్ కాబోతున్న చీకటి వెంకట్రాం నర్సయ్యను మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టిపిటిఎఫ్ కేసముద్రం మండల అధ్యక్షులు గుండు సురేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కుల సాధన, ప్రభుత్వ విద్యా పరిరక్షణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా టిపిటిఎఫ్ ఏర్పడిన నాటి నుండి నిరంతర పోరాట పంథాలో ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపు, ఉపాధ్యాయుల గౌరవ పరిరక్షణలో సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు అనేక పరిపాలనా ఒత్తిళ్లు, బోధనేతర పనుల భారం, ఖాళీ పోస్టులు, పెండింగ్ సమస్యలు, పదోన్నతులు ఆలస్యం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, పెండింగ్లో ఉన్న ఐదు డిఏ లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నర్సింహరాజు, సీనియర్ నాయకులు, స్టేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బందెల రాజు, మండల కమిటీ నిర్మాణ బాధ్యులు చీకటి వెంకట్రాం నర్సయ్య, ఉపాధ్యక్షులు కొమ్ము రాజేందర్, సంద్ర రాధిక, కార్యదర్శులు వీసం నర్సయ్య, జీ.మోహనకృష్ణ, బొల్లెద్దు చందర్, జిల్లా కౌన్సిలర్ ముదిగిరి సదయ్య, అకడమిక్ సెల్ కన్వీనర్ జి.శ్రీనివాస్, కమిటీ సభ్యులు కుసుమ సంతోష్, ఎస్.అనిత, వి.స్వర్ణలత, జి.చిన్నమ్మ, రణదీప్ తదితరులు పాల్గొన్నారు.



# మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ. 60.18 లక్షలు



**మహానంది, మే 29 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో మహానందీశ్వర స్వామివారి హుండీ, ఉభయ దేవాలయాల హుండీ లెక్కింపు నిర్వహించగా మహానందీశ్వర స్వామివారికి రూ. 60,18,167 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో ఎన్.శ్రీనివాస రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మహానంది ఆలయంలోని అభిషేకం మండపంలో స్వామివారి హుండీతో పాటు ఉభయ దేవాలయాల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 60 రోజులకు గాను స్వామివారికి రూ. హుండీ కానుకల ద్వారా రూ.59,21,476, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ. 69,515 ,గో సంరక్షణ హుండీ ద్వారా రూ.27,176, మరియు 2 గ్రాముల 950 మిల్లీ గ్రా ల బంగారం, 260 గ్రా ల వెండి ,మొత్తం రూ. 60, 18,167 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖా తరుపున వెలుగోడు గ్రూప్ టెంపుల్ ఈఓ జనార్దన్ శెట్టి, మహానంది దేవస్థాన ఏఈఓ మధు,ఆలయ పర్యవేక్షకులు,ఇన్స్పెక్టర్లు మరియు ఆలయ అర్చకులు, సిబ్బంది, వివిధ జిల్లాల నుండి విచ్చేసిన బాలాజీ సేవా ట్రస్ట్, తిరుమల బాలాజీ సేవా సమితి, భ్రమరాంబ సేవ, శ్రీరామసేవ ట్రస్ట్ శ్రీ ఆంజనేయ సేవాసమితి సేవకులు పాల్గొన్నారు.



# ప్రజలకు చేరువగా ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం







### సమస్యల వేగవంతమైన పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ

### ప్రజల వ్యయ, ప్రయాసలకు స్వస్తి పలుకుతున్న ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు

**పెనుగొండబ్యూరో చీఫ్ : మే 29, నంది పత్రిక** ప్రజల సమస్యలను స్థానికంగానే స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా ఆచంట నియోజకవర్గంలోని వాసవి పెనుగొండలో శుక్రవారం ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షత వహించగా, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మరియు హౌసింగ్ పీడీ జి.పిచ్చయ్య, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి తదితర అధికారులు పాల్గొని ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఒక్కో నియోజకవర్గంలో నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా, ఆచంట నియోజకవర్గంలో ఇప్పటికే మే 15, మే 22 తేదీలలో రెండు విడతలుగా విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. మే 29న మూడవ విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండు విడతలుగా నిర్వహించిన పీజిఆర్ఎస్ సమావేశాల్లో వరుసగా 212, 229 అర్జీలను స్వీకరించడం జరిగిందని, ఈ రోజు స్వీకరించిన 354 దరఖాస్తులతో కలిపి మొత్తం 795 అర్జీలను స్వీకరించడం జరిగిందని, వీటిలో ఇప్పటి వరకు 133 అర్జీలను పరిష్కరించడం జరిగిందని, మిగతా దరఖాస్తులు వివిధ పరిష్కార దశల్లో ఉన్నాయని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా, ప్రభుత్వమే వారి వద్దకు వచ్చి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలను తీసుకురావడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని వివరించారు. అధికారులు ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని పూర్తిగా చదివి, నాణ్యమైన పరిష్కారం అందించాల్సిన బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే దరఖాస్తులు చేసుకునే పరిస్థితి రాకుండా సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో మన ముఖ్యమంత్రి తీసుకునే కొన్ని విప్లవాత్మకమైన నిర్ణయాలలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం కూడా ఒకటి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీలు సమర్పించడం ప్రజలకు కొంత ప్రయాసతో కూడుకున్న విషయమని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలోనే పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసిందన్నారు. జిల్లా స్థాయి అధికారులందరూ నియోజకవర్గానికి రావడం, స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల సమస్యల పరిష్కారం మరింత వేగవంతంగా, సులభంగా జరుగుతుందని శాసనసభ్యులు తెలిపారు. సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు అధికారులకు అభినందనలు తెలిపారు. నూటికి 70 – 80 శాతం పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరుకు, 30% దరఖాస్తులు భూతగాధాలు, వ్యక్తిగత సమస్యలు, కోర్టు పరిధిలో ఉన్నవి వస్తున్నాయని అన్నారు. కోర్టు లిటిగేషన్లో ఉన్న ఫిర్యాదులపై కలుగజేసుకోవద్దు అని హితవు పాల8కారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు జిల్లా కలెక్టర్ స్వయంగా వివిధ కౌంటర్ల వద్ద జరుగుతున్న అర్జీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సావధానంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు కౌంటర్ల వద్దకు వచ్చినప్పుడు వారికి కూర్చునే సౌకర్యం కల్పించి, ప్రాధాన్యతతో సేవలు అందించాలని ఆదేశించారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను తెలియజేయడం విశేషంగా నిలిచింది. ప్రజల స్పందన కార్యక్రమం పట్ల ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తాడేరులో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ (సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్) కొరకు స్థలాన్ని సిద్ధంచేసి పనులు వేగవంతం





### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం బ్యూరో చీఫ్ మే 29 నంది పత్రిక** జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం తాడేరు గ్రామంలో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కొరకు సమీకరించిన 6.6 ఎకరాల స్థలాని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పనికిరాని ఘన వ్యర్థాలను సేకరించి, వాటిని పర్యావరణానికి హాని కలగకుండా శుద్ధి చేసిన అనంతరం వచ్చిన రద్దును ఉంచే ప్రక్రియ నిర్వహణకు స్థలాన్ని సిద్ధం చేయాలని అన్నారు. స్థలాన్ని వినియోగంలోనికి తెచ్చే విధంగా స్థలాన్ని శుభ్రం చేసి లెవెలింగ్ చేసి, అనంతరం మట్టితో మెరక చేయాలని మండల తహసిల్దార్ రావి రాంబాబును ఆదేశించారు. స్థలానికి సమీపంలో ఉన్న చెరువు నుంచి వచ్చే నీరు స్థలంలోకి చేరి బురదగా ఉండడం వలన దాన్ని పూర్తిగా అరికట్టాలని అన్నారు. పట్టణ పరిధిలో ఏ చెరువులు వద్ద మట్టి అందుబాటులో ఉన్నదో పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రానికి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ పనులన్నీ వర్షాకాలంలోపులోనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పబ్లిక్ హెల్త్ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పనులు వేగవంతం చేయాలని తెలియజేశారు. ఈ కేంద్రం వినియోగంలోనికి వస్తే ఇళ్లు, పరిశ్రమలు మరియు వాణిజ్య ప్రాంతాల నుండి సేకరించిన చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా విభజించి తడిచెత్తను సేంద్రీయ ఎరువుగా, పొడి చెత్తలో ప్లాస్టిక్, కాగితం, గాజు, ఐరన్ తదితర వస్తువులను వేరుచేయడం జరుగుతుందని అన్నారు. రీసైక్లింగ్ ప్రాసెసింగ్ ద్వారా వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా మార్చడం, రీసైకిల్ కాని చెత్తను పర్యావరణ నిబంధనల ప్రకారం సురక్షితమైన ల్యాండ్ ఫిల్స్ లో పూడ్చిపెట్టడం జరుగుతుందన్నారు. ఘన వ్యర్థాలను సేకరించడం, శుద్ధి చేయడం మరియు పారవేసే పూర్తి ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కేంద్రాన్ని అందుబాటులోనికి తీసుకువచ్చేందుకు పనులన్నీ పారదర్శకంగా, వేగవంతంగా అన్ని శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మండల తహసిల్దార్ రావి రమేష్, పబ్లిక్ హెల్త్ డి.ఇ ఆర్.విజయ్, పట్టణ ప్లానింగ్ అధికారి పార్థసారథి, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సిరివెళ్ల మండలంలో ఘనంగా "గోటు విలేజ్" కార్యక్రమం



**సిరివెళ్ల (నంది పత్రిక)**విద్య ద్వారానే మాదిగ సమాజ అభివృద్ధి సాధ్యమని నాయకుల పిలుపుసిరివెళ్ల మండలంలోని ఎస్సీ కాలనీలో గురువారం "గోటు విలేజ్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి & జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ సూచనలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మీస్రా నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మేకల దస్తగిరి మాదిగ, మీస్రా మండల ఇన్‌చార్జి పెద్ద హుస్సేన్ మాదిగ, మీస్రా సిరివెళ్ల మండల అధ్యక్షుడు జైపాల్ మాదిగ, వీ౹ాూ సిరివెళ్ల మండల అధ్యక్షుడు లక్ష్మీనరసింహ మాదిగ హాజరయ్యారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ** "ఎస్సీ వర్గీకరణ ఫలాలు నిజంగా మాదిగలకు అందాలంటే విద్య ఒక్కటే ప్రధాన ఆయుధం, బలమైన ఆధారం. ప్రతి మాదిగ పల్లెలోని బిడ్డ ఐదు సంవత్సరాలు నిండగానే పాఠశాలలో చేరాలి" అని పిలుపునిచ్చారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్,అగ్రికల్చర్, హార్టికల్చర్ వంటి డిప్లొమా కోర్సుల్లో చేరి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎజుజ వంటి గ్రూపులను ఎంపిక చేసుకొని ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని ప్రోత్సహించారు. విద్యార్థులు ఇంటర్మీడియట్‌తోనే ఆగిపోకుండా డిగ్రీలు, పీజీలు, ఎంఫిల్, పీహెచ్‌డీలు వరకు చదువును కొనసాగించాలని నాయకులు ఆకాంక్షించారు. వివిధ ఎంట్రన్స్ పరీక్షల్లో కష్టపడి చదివి ప్రతిభను చాటాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘ పెద్దలు, యువత, మహిళామూర్తులు, విద్యార్థులు ఎన్. నాని, గాలి జే హర్ష, డి. రాయుడు, ఎన్. చరణ్, ఎన్ సోను, పి. రజిత, జనని, వర్షపావని తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా మీస్రా నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మేకల దస్తగిరి మాదిగ, మీస్రా మండల ఇన్‌చార్జి పెద్ద హుస్సేన్ మాదిగ, గ్రామ ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సింగారి అనంతయ్య

### రెండు వేల మందిలో ప్రతిభ చూపిన నందికొట్కూరు వాసి

### హైదరాబాద్ లో గిన్నిస్ పత్రాలు అందుకున్న అనంతయ్య



**నందికొట్కూరు మే 29, (నంది పత్రిక ) :** ఫిబ్రవరి 2న, 2026 హైదరాబాద్ లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ఆధ్వర్యంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ కీ బోర్డ్ వారి ఆధ్వర్యంలో వాయిద్య కారులు కీబోర్డ్ ఆగకుండా వాయించే పోటీలను నిర్వహించారు. పోటీల్లో 22 దేశాల నుండి దాదాపు 2 వేల మంది పాల్గొనగా అందులో 777మంది ఎంపికయ్యారు. అందులో అనంతయ్య ఎంపికై హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. నందికొట్కూరు కు సింగారి శేషయ్య, గ్రేసమ్మ దంపతుల కుమారుడు సింగారి అనంతయ్య. ప్రైవేట్ ఉద్యోగం చేస్తారు. ఈయనకు కీ బోర్డ్ వాయిద్యముపై మంచి పట్టు ఉంది. అయితే ఫిబ్రవరి 2, 2026న హైదరాబాదులో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల ఆధ్వర్యం కీ బోర్డ్ వాయిద్యం పోటీలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో 22 దేశాల నుండి 2వేల మంది పాల్గొని కీబోర్డ్ వాయిద్యకారులు గంటపాటు కీబోర్డ్ ఆగకుండా వాయిస్తూ పాల్గొన్నారు. అందులో కీబోర్డ్ వాయించడంలో 777 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో నందికొట్కూరు కు చెందిన సింగారి అనంతయ్య ఉత్తమ ప్రతిభ కనపరచడంతో గిన్నిస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కు ఎంపికయ్యారు. ఎంపికైన అనంతయ్యను ఈ స్కూలు వ్యవస్థాపకులు అగస్టిన్ దండింగి హైదరాబాద్ లో శుక్రవారం విక్టోరియా ఆడిటోరియం గచ్చిబౌలి లోని హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ప్రాంగణంలో గిన్నిస్ 'అచీవర్స్ మీట్ లో సర్టిఫికేట్లు అందజేసి అభినందించారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన శుభ సందర్భముగా న అనంతయ్యను మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

# ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కు పాముకాటు



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యొక్క ఫీల్డ్ అసిస్టెంట్ భాష పాముకాటుకు గురయ్యాడు ఈయనతోపాటు మరొక వ్యక్తి హబీబ్ సైతం పాము కాటుకు గురి కావడంతో గోస్పాడు మండలం యాలూరు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ఫీల్డ్ అసిస్టెంట్ భాషను మరియు హబీబ్ ను ఇద్దర్నీ నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ వైద్య సేవలు పొందుతున్నట్లు తెలియజేశారు పాముకాటుకు గురై వైద్య సేవలు పొందుతున్న సిబ్బందిని టెక్నికల్ అసిస్టెంట్ ఇతర సిబ్బంది పరామర్శించారు. అనంతరం నంద్యాల హాస్పిటల్ కి వెళ్లి టిడిపి నంద్యాల జిల్లాఉపాధ్యక్షురాలు శకుంతలమ్మ పరామర్శించారు.

# శాతాబ్ధిక వృద్ధుడు మృతి



**కొత్తపల్లి – నంది పత్రిక:** మండల కేంద్రంలో ఓ శాతాబ్దిక వృద్ధుడు గురువారం రాత్రి మృతిచెందాడు. వివరాల్లోకి వెలితే మండల కేంద్రమైన కొత్తపల్లి గ్రామానికి చెందిన ఏళ్ల బాల సుబ్బారెడ్డి(108) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురి అయి మృత్యువాత పడ్డాడు. ఈయన 1918 లో జన్మించి ఇంతవరకు ఎంతో ఆరోగ్యంగా ఉన్నాడని గ్రామస్థులు తెలుపుతున్నారు. వృద్ధుడికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉండగా ఇందులో పెద్ద కొడుకు, చిన్న కొడుకు ఇద్దరు చనిపోయారు. అయిన బాలసుబ్బారెడ్డి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని 108 ఏళ్లు జీవించి ఉన్నాడని గ్రామస్థులు తెలుపుతున్నారు.

# కొలనుభారతి క్షేత్రంలో బహిరంగ వేలంపాటలు



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని ఏకైక సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతి దేవి క్షేత్రంలో శుక్రవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీశైలం దేవస్థానం ఏఈఓ శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఈఓ కార్తీక్ ల అధ్యక్షతన అంగళ్ల నిర్వహణకు బహిరంగ వేలంపాటలను నిర్వహించారు. ఈ వేలంపాటలో టెంకాయాలకు అమ్ముకొనుటకు గత ఏడాది రూ.80 వేలు రాగా ప్రస్తుతం రూ.80వేలు వచ్చిందని, మిశ్రమ బియ్యం, కొబ్బరి గిన్నెలు పోగు చేసుకొనే హక్కు కోసం గత ఏడాది రూ.1,60,000 రాగా ఏ ఏడాది రూ.3,06,000 పలికింది. అదేవిధంగా అక్షరాభ్యాసము, పూజా సామాగ్రి సెట్టు సప్లై హక్కుకోసం గత ఏడాది రూ.1.20,000 రాగా ఈ సంవత్సరం రూ.2,31,000 వేలంపాటలో పలికాయి. గత ఏడాది బహిరంగ వేలంపాటలో రూ.3,50,000 వచ్చింది. ఈ ఏడాది ఇందులో రూ.6,17,000 వచ్చింది. దీంతో ఈ సంవత్సరం అదనపు ఆదాయంగా రూ.2,67,000 వచ్చింది. అధికారులు వెల్లడించారు. వేలంపాటలో హక్కులు పొందిన వారు జూన్ నెల 1వ తేదీనుంచి 2027 సంవత్సరం మే 31వ తేదివరకు హక్కు ఉంటుందని, అదికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేస్తామన్నారు.

# ఏపీలో మహిళల రక్షణ కోసం ‘ఆపరేషన్ దండాయన‘ ప్రారంభం.





**గోనెగండ్లలో “ఆపరేషన్ దండాయన” పోస్టర్స్ ను ఆవిష్కరించిన ... కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**

**2025 జనవరి నుండి 2026 మే 28 వరకు కర్నూలు జిల్లాలో 10 కేసుల్లో 17 మందికి కఠిన శిక్షలు.**

**పోక్సో కేసుల్లో 20 ఏళ్ల జైలు శిక్ష .**

**నిందితులపై 59 రౌడీషీట్లు ఓపెన్ చేశాం.**

**జీరో టాలరెన్స్ ... కాన్విక్షన్**

**బేస్డ్ పోలీసింగ్:**

**మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత**

**60 రోజుల్లోనే చార్జిషీట్ ...ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన శిక్షలు**

**తప్పు చేస్తే ఎంతటి వారైనా వదిలేది లేదు**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలు , బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, మహిళలపై జరుగుతున్న నేరాలలో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఆధ్వర్యంలో, మహిళా & శిశు భద్రత విభాగం ఐజీపీ బి. రాజకుమారి ఐపీఎస్ పర్యవేక్షణలో “ఆపరేషన్ దండాయన” కార్యక్రమాన్ని ఏపీ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గోనెగండ్ల పోలీసుస్టేషన్ సమీపం లోని భాషా ఫంక్షన్ హాల్ లో మహిళల భద్రత , నేరాల నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు . “ఆపరేషన్ దండాయన” పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ...మహిళల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. మహిళలు ఎటువంటి వేధింపులు, సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెరిగితేనే నేరాలు తగ్గుతాయని పేర్కొన్నారు.పని ప్రదేశాల్లో లేదా సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న “శక్తి యాప్” వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, 100, 181, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.మహిళల పై జరిగే నేరాల విషయంలో “జీరో టాలరెన్స్ పాలసీ” అమలు చేస్తూ, అత్యాచారాలు, పోక్సో, గృహ హింస తదితర కేసుల్లో నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి కేసులో 60 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు చేయడం, ముఖ్యమైన కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేయడం, నేరస్తులపై నిరంతర నిఘా ఉంచడం జరుగుతుందన్నారు.పునరావృత నేరస్తులు, మహిళలపై నేరాలకు పాల్పడుతున్న అనుమానితులపై సెక్సువల్ అఫెండర్ షీట్లు తెరిచి ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామన్నారు .కర్నూలు జిల్లాలో మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల్లో 2025 జనవరి నుండి 2026 మే 28 వరకు మొత్తం 10 కేసుల్లో 17 మందికి శిక్షలు పడినట్లు తెలిపారు. ఇందులో పోక్సో , మహిళలపై వేధింపులు, ఎస్సీ / ఎస్టీ చట్టాలకు సంబంధించిన కేసులు ఉన్నాయన్నారు.మహిళలు, బాలికల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.నియోజకవర్గాల వారీగా 42 అవగాహన కార్యక్రమాలు, పోలీస్ స్టేషన్ల వారీగా 687 అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామన్నారు. 2025–2026 సంవత్సరంలో మహిళలపై నేరాలు మరియు పోక్సో కేసుల్లో నిందితులపై ప్రత్యేక నిఘా చర్యల్లో భాగంగా మొత్తం 59 మంది నిందితుల పై రౌడీ షీట్లు ఓపెన్ చేశామన్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి మాట్లాడుతూ...మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు లేదా మహిళలపై వేధింపులు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి, మహిళా పియస్ డిఎస్పీ ఉపేంద్రబాబు, ఎమ్పిడిఓ మణిమంజరి, గోనెగండ్ల ఎమ్మార్వో రాజేశ్వరి, గోనెగండ్ల పియస్ సిఐ చంద్రబాబునాయుడు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుర్వ మల్లయ్య , మహిళలు పాల్గొన్నారు.



# చల్లా భగీరథరెడ్డి కి ఘన నివాళి

**జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన కుమారులు**





**అవుకుమే 29నందిపత్రిక** దివంగత నేత, డైనమిక్ యూత్ లీడర్ మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ చల్లా భగీరథరెడ్డి 50 జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. అవుకు లోని చల్లా శ్రీలక్ష్మి కార్యాలయంలో ఆమె కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి అందరికి పంచారు.అనంతరం చల్లా ఫాంహౌస్ లోని చల్లా భగీరథరెడ్డి స్మారక స్తూపం వద్దకు కార్యకర్తలతో వెల్లి,భగీరథ రెడ్డి ఇద్దరు కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డి తండ్రికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు నాన్న ఆశయాలను కొనసాగిస్తూ,వారి అడుగుజాడల్లో నడుస్తామని అక్కడికి వచ్చిన కార్యకర్తలతో అన్నారు.అనంతరం వారి తాత అయిన స్వర్గీయ చల్లా రామకృష్ణారెడ్డి స్మారక చిహ్నం వద్దకు చేరుకొని పూలమాలలు వేసి నివాళి అర్పించారు ఈ కార్యక్రమంలో, , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు .

# మాజీ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పై ఈడి దాడి దారుణం .




**బేతంచెర్ల మే 29 (నందిపత్రిక).** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పై, బిజెపి నరేంద్ర మోడీ ఈడి దాడి చేయించడం దారుణమని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, కార్యదర్శి బి. రామాంజనేయులు అన్నారు. బేతంచెర్ల మండల కేంద్రంలోని పాత బస్టాండ్ భారత్ బేకరీ సర్కిల్ నందు సిపిఎం పార్టీ కార్యదర్శి బి రామాంజనేయులు ఆధ్వర్యంలో పినరయ్ విజయన్ పై ఈడి విచారణను నిరసిస్తూ శుక్రవారం రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేరళ రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పరిపాలించి, ఆ రాష్ట్రాన్ని 100% అక్షరాస్యతను సాధించి, భారత దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిన పినరయ్ విజయన్ పై బిజెపి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కక్ష సాధింపుతో, ఈడి దాడులు చేయించడం సిగ్గుచేటని వారన్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని, ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయించడం, బెదిరించడం, లొంగదీసుకోవడం సరైనది కాదని వారు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పై ఈడి దాడి చేయించగా, వారికి ఎటువంటి ఆధారాలు దొరకక పోవడం వలన, వట్టి చేతులతో తిరిగి వచ్చిన సంగతి మేధావులు ప్రజాప్రతినిధులు, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అనవసరమైన ఈడీ దాడులు, బెదిరింపులు,కక్ష సాధింపులు మానుకోకపోతే, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వామపక్షాలను, ప్రజలలో కలుపుకొని, అన్ని విధాలుగా ఉద్యమ పోరాటాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. న్యాయం కోసం ఎర్రజెండా నాయకులు, కార్యకర్తలు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో మద్దిలేటి స్వామి, చల్లా మద్దిలేటి స్వామి, శ్రీనివాసులు, పెద్దయ్య, కోట్ల మధు, లోకేష్, రాజు, మధు, వెంకటేశ్వర్లు, షేక్షావలి, శ్రీనివాసులు, సుమన్, వెంకటరామిరెడ్డి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణాల అభివృద్ధిలో కమిషనర్లే కీలకం




**యంత్రాంగంతో సమర్ధవంతంగా పనిచేయించాలి**
**మున్సిపల్ శాఖ సిడిఎంఏ పి.సంపత్ కుమార్, ఐఏయస్**
**జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగర/పట్టణాల అభివృద్ధిలో కమిషనర్లే కీలకమని, వారు బాధ్యతగా, స్మార్ట్ వర్క్‌తో సమర్థవంతంగా పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని రాష్ట్ర పురపాలక శాఖ పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఏ) పి.సంపత్ కుమార్, ఐఏయస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో జోన్ కమిషనర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు గార్గేయపురం, జొహరాపురం డంప్ యార్డుల్లో బయో మైనింగ్, సి & డి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. గార్గేయపురం డంప్‌యార్డులో ఘన వ్యర్థాల బయో మైనింగ్ జాప్యం చేయొద్దని స్పష్టం చేశారు. 15 ఎకరాల్లో బయో మైనింగ్ పూర్తి అయిన వెంటనే చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి (వేస్ట్ టు ఎనర్జీ) ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ప్రారంభించాలని, మరో 9.5 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. బయో మైనింగ్ పనులను రోజువారీ లక్ష్యాలతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. గార్గేయపురం డంప్‌యార్డులో రెండు నెలల్లో, జొహరాపురం డంప్‌యార్డులో ఒక నెలలో బయో మైనింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించిన సిడిఎంఏ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ.. కమిషనర్లు ప్రతిరోజూ 2 నుంచి 3 గంటలు క్షేత్రస్థాయిలో ఉండాలని సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో మార్పు కనిపించేలా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో సానుభూతి పొందేలా, తద్వారా స్వచ్ఛతక ప్రజల సహకారం అందేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. గార్బేజ్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించి జరిమానాలు విధించాలని, అయినప్పటికీ మార్పు లేకపోతే వీడియో ఆధారాలతో కేసులు నమోదు చేయాలని సూచించారు. త్వరలో చెత్త వేస్తే జరిమానాలు విధించే విధానంపై పూర్తి విధివిధానాలతో ఉత్తర్వులు ఇస్తామన్నారు.డ్రైనేజీ కాలువలు, పారిశుద్ధ్య సమస్యలు, ప్రజా ఫిర్యాదులపై పూర్తిస్థాయి అవగాహన కమిషనర్లకు ఉండాలని సూచించారు. ప్రజాప్రతినిధుల కంటే ముందే సమస్యలు కమిషనర్ల దృష్టిలో ఉండాలన్నారు. ప్రతిరోజూ సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి అవసరమైన దిశానిర్దేశం చేయాలన్నారు. అన్ని సక్రమంగా ఉన్న ప్రాంతాల కంటే సమస్యలు ఉన్న ప్రాంతాలపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. సాధారణ నిధుల ఖర్చులో నిర్వహణ పనులకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తర్వాతే అత్యవసర పనులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.జీవో 75ను పక్కాగా అమలు చేయాలని, ప్రజాప్రతినిధులకు సైతం దీని గురించి తెలియజేయాలని ఆదేశించారు. ఇంటింటికీ డిజిటల్ క్యూ ఆర్ కోడ్ వ్యవస్థ అమలు చేసి, శాటిలైట్ ఆధారంగా ఆస్తుల విస్తీర్ణం, ప్రభుత్వ–ప్రైవేటు సేవలకు సమాచారాన్ని అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఆస్తి పన్ను వసూళ్లు మెరుగుపరచాలని సూచించారు. పారిశుద్ధ్యం, పచ్చదనం, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యాలని తెలిపారు. డ్రైనేజీ లేకపోతే కనీసం కచ్చా కాలువ అయినా నిర్మించాలని, ప్రతిదానిని నిధులతో ముడిపెట్టడం సరికాదన్నారు. అందుబాటులో ఉన్న వనరులతో సాధ్యమైనంత సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎక్కువ జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో సమస్యలను ముందుగా పరిష్కరించాలని, రహదారులపై గుంతలు పూడ్చాలని ఆదేశించారు. పూడికతీత పనులు జాప్యం చేయకుండా పూర్తి చేయాలని, ఖాళీ స్థలాలపై విఎల్‌టి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఆయా స్థలాల యజమానుల వివరాలు సేకరించాలని సూచించారు. గార్బేజ్ పాయింట్లు లేకుండా వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉంటే నిధుల లభ్యతను బట్టి టౌన్ లెవల్ ఫెడరేషన్ ద్వారా పారిశుద్ధ్య సిబ్బందిని నియమించుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, అధికారులు స్మార్ట్ వర్క్ చేయాలని సూచించారు. రాయలసీమ ప్రాంత పట్టణాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు మొక్కుబడిగా కాకుండా కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. పైపై విధులు సరికాదని, సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు.పట్టణాల వారీగా సమీక్ష నిర్వహించిన సిడిఎంఏ, కర్నూలు కార్పొరేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖచిత్ర సమాచారం, నివేదికలు, ముందస్తు చర్యలు వంటి అంశాలపై కమిషనర్ చల్లా ఓబులేసును అభినందించారు. కర్నూలులో పిన్ పాయింట్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నామని కమిషనర్ వివరించారు. చెత్త వాహనాలకు జీపీఎస్ అమర్చడం, ప్రాసెసింగ్ పాయింట్ల పర్యవేక్షణ వంటి అంశాలను వివరించారు. కర్నూలు కార్పొరేషన్‌ను జిల్లా మున్సిపాలిటీలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆదోనిలో ఇంటింటి చెత్త సేకరణ 27 సచివాలయాల పరిధిలో సక్రమంగా జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్‌కు మెమో ఇస్తామని హెచ్చరించారు. గార్బేజ్ ఫ్రీ, పూడికతీత పనులు సమర్థవంతంగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదోని పట్టణ పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, కమిషనర్ నయీం, ఎంహెచ్ఓ సందీప్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో అవసరమైన చోట్ల డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు.గూడూరులో పారిశుద్ధ్యం వెనుకబడిందని, మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. డోర్ టూ డోర్ కలెక్షన్ సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. దీనిపై అధికారుల నుంచి పొంతనలేని సమాధానాలు రావడంతో సిడిఏంఏ అసహనం వ్యక్తం చేశారు.డోన్‌లో పారిశుద్ధ్యం పూర్తిగా అధ్వానంగా ఉందని కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కమిషనర్‌పై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాలను తప్పనిసరిగా సందర్శించాలని సూచించారు. సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.సమావేశంలో అనంతపురం ఆర్డిఎంఏ నాగరాజు, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఎమ్మిగనూరు కమిషనర్ గంగిరెడ్డి, ఆదోని కమిషనర్ నయీం, గూడూరు కమిషనర్ ఏ.వి. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# నేడు పసుపల గ్రామంలో మంత్రి పర్యటన



**బనగానపల్లె మే 29నందిపత్రిక** రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి శనివారం సాయంత్రం బనగానపల్లె మండల పరిధిలోని పసుపల గ్రామంలో పర్యటిస్తారని మంత్రి కార్యాలయ వర్గం శుక్రవారం తెలిపారు. ఈ పర్యటనలో మంత్రి గ్రామంలో ఇదివరకే నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ,ఓ హెచ్ ఎస్ ఆర్ ట్యాంక్ ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు.

## పిఎసిఎస్ ధన్నసరి సిఈఓ గోపాల మల్లారెడ్డి పదవీ విరమణ.

**మల్లారెడ్డి దంపతులను సన్మానించిన ఎంఎల్ఏ.**



**కేసముద్రం, మే 29(నంది పత్రిక)**:సహకార వ్యవస్థలో 42 ఏళ్ల పాటు విశేషమైన సేవలందించి, రైతులు, సంఘం సభ్యుల అభ్యున్నతి కోసం ఆహర్నిశలు కృషి చేసిన 3వ వార్డుకి చెందిన దన్నసరి పిఏసిఎస్ బ్యాంక్ సిఈఓ గోపాల మల్లారెడ్డి–పుష్పావతి దంపతుల పదవీ విరమణ అభినందన సభ శుక్రవారం హరిహర గార్డెన్స్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మల్లారెడ్డి దంపతులను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కేసముద్రం మండలానికి పలు పార్టీల నాయకులు, అధికారులు సీఈవోగా చేసిన సేవలను కొనియాడారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, మార్కెట్ డైరెక్టర్లు, వార్డు కౌన్సిలర్లు, స్థానికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# మహానాడు వేదికగా మహిళా రిజర్వేషన్ కు బలమైన పునాది






## కర్నూల్ జిల్లా టిడిపి అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** మహిళా సాధికారతకు బాటలు వేసినందుకు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపిన కర్నూల్ జిల్లా టిడిపి అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ --మరియు మహిళా కమిటీ సభ్యులుఈనెల 27 28 తేదీలలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు లో రానున్న ఎన్నికలలో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తామని ఇది పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన ఆమోదం పొందకపోయినా మన రాష్ట్రంలో మాత్రం కచ్చితంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడం పట్ల తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణ మ్మ మరియు తెలుగు మహిళ పార్లమెంటును కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, కర్నూలు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో ఉన్నటువంటి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి స్థానిక విశ్వేశ్వర సర్కిల్ నందు మహిళలు 33 శాతం రిజర్వేషన్లకు మద్దతుగా ఆలూరు నియోజకవర్గం పార్టీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి, బొజ్జమ్మ, పద్మలతారెడ్డి సంజీవ లక్ష్మి, ఎస్ జికియ అక్సారి, కోట్ల కవితమ్మ మరియు మహిళలతో కలిసి విశ్వేశ్వరైఅహ్ సర్కిల్ లో ర్యాలీ నిర్వహించడం జరిగింది .అనంతరం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం నందు విలేఖరుల సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీని చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలు తీసుకున్నటువంటి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మహిళా రిజర్వేషన్లు మహిళ సాధికారత పేపర్లకే పరిమితం కాకుండా చేతుల్లో చూపించారని ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయంగా పేర్కొన్నారు. మహిళలకు రాజకీయ స్వేచ్ఛ సముచిత స్థానం కల్పించి వారిని ప్రోత్సాహిస్తున్నది తెలుగుదేశం పార్టీ ఒక్కటేనని గుర్తు చేసుకున్నారు మహిళలకు గౌరవము అవకాశాలు నాయకత్వం కల్పించే పార్టీ కూడా తెలుగుదేశం పార్టీని అన్నారు మహిళలకు అస్తి హక్కు సామాజికంగా రాజకీయంగా ప్రోత్సహించడం వంటి వాటిలో తెలుగుదేశం పార్టీని మించినది మరే పార్టీ లేదని చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ కూడా తెలుగుదేశం పార్టీని తెలిపారు. విద్య ఉద్యోగాల్లో పై మూడు శాతం రిజర్వేషన్లు కల్పించింది మొట్టమొదటిసారిగా శాసనసభ స్పీకర్ ఒక మహిళకు అవకాశం కల్పించింది కూడా తెలుగుదేశం పార్టీని అన్నారు.

మహిళా సాధికారతే టిడిపి లక్ష్యం మహిళలకు ఆర్థికంగా స్వావలంబన కల్పించే దిశలో భాగంగా 12 లక్షల డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసి 1.12 కోట్ల మంది మహిళలకు ఆదాయ అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ బ్యాంక్ లింకేజీ ద్వారా ఇప్పటివరకు 68 వేల ఎనిమిది వందల ముప్పై కోట్లు ఆర్థిక సహాయం అందించింది రాష్ట్రంలో ఐదు లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసింది మహిళలకే అత్యధికంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ సామాజిక భద్రతా పెన్షన్లు ప్రతినెల 32.92 లక్షల మందికి ఒక వెయ్యి 594 కోట్ల పెన్షన్ పంపిణీ జరుగుతుంది శ్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా ఇప్పటివరకు 60 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. తల్లికి వందనం ద్వారా 43 లక్షల మంది తల్లుల ఖాతాలో 8745 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగింది దీపం మరియు దీపం 2.0 పథకాల ద్వారా మహిళల వంటింటి కష్టాలకు చేర్పెడుతూ గతంలో ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందివ్వడం జరుగుతుంది. మహిళలపై అత్యాచారాలకు పాల్పడితే అదే చివరి రోజు అవుతుందని మహిళలకు భద్రత కల్పించడంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో ముందుందని తెలియజేశారు వేధింపులు దాడులు అన్యాయాలపై ఎలాంటి రాజు లేకుండా చట్టం తన పని తాను చేసుకుని వెళుతుందని నమ్మం నమ్మకం కలిగించినది చంద్రబాబు నాయుడు మాత్రమేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్తలు బి.చిన్నమ్మి, విజయ లక్ష్మి, మాలిని మొదలగు వారితో పాటు మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన అందరికీ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**కర్నూలు నంది పత్రిక బ్యూరో..** ..అర్హులైన అందరికీ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లో స్త్రీ శక్తి, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్, అన్నదాత సుఖీభవ తదితర సూపర్ సిక్స్ పథకాల అమలు పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "తల్లికి వందనం" పథకం కింద లబ్ధి పొందుతున్న తల్లిదండ్రులు, విద్యార్థుల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. లబ్ధి అందని విద్యార్థులు, తల్లిదండ్రుల వివరాలను గుర్తించి, అందుకు గల కారణాలను "రిమార్క్స్" కాలమ్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. పథకం అమలులో ఎంత శాతం మంది కవర్ అయ్యారు, ఇంకా ఎంత శాతం మంది కవర్ కావాల్సి ఉందనే వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలన్నారు. అర్హులైన ప్రతి విద్యార్థి, ప్రతి తల్లికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు..విద్యాశాఖకు సంబంధించిన సమగ్ర గణాంక వివరాలు, పాఠశాలల మౌలిక వసతులు, విద్యార్థుల నమోదు, ఉద్యోగుల వివరాలు, పాస్ శాతం, అందుబాటులో ఉన్న కోర్సులు తదితర విద్యా రంగానికి సంబంధించిన పూర్తి స్థాయి సమాచారాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ సర్వ శిక్ష అభియాన్ మరియు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సాధించిన లక్ష్యాలు, లోపాల వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలన్నారు.స్త్రీ శక్తి" పథకం ద్వారా ఇప్పటివరకు ఎంతమంది మహిళలు ప్రయోజనం పొందారు, దీనివల్ల ఎంత మేర వ్యయం జరిగిందనే వివరాలను డేటా రూపంలో సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు.అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో ఇన్‌స్టాల్‌మెంట్ వారీగా ఎంతమంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యిందనే వివరాలను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే జమ కాని రైతుల వివరాలు, అందుకు గల కారణాలను కూడా నివేదికలో పొందుపరచాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కు సంబంధించి జిల్లాలో ఎన్ని రకాల పెన్షన్ లను అందిస్తున్నాం, విభాగాల వారీగా ఎంతమందికి పెన్షన్ ఇస్తున్నారు, అనే వివరాలను ఇవ్వాలని కలెక్టర్ డి ఆర్ డి ఎ పిడి ని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ రమణ రెడ్డి, డిఆర్డిఏ పిడి రమణ రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, సర్వ శిక్ష అభియాన్ పిఓ లోకరాజ్ పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మణీయుడు ఎన్టీఆర్.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గిత్త, టిడిపి నేత మండ్రా.



**నందికొట్కూరు మే 29( నంది పత్రిక)** దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డులో తెలుగు ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టిన మహానేత స్వర్గీయ నందమూరి తారక రామారావు అని, ఆయన పాలనలో స్త్రీ సంక్షేమం సమానత్వం, రెండు రూపాయలకేలో బియ్యం అందించి బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచిన ఘనత మాజీ సీఎం టీడీపీ వ్యవస్థక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావుకి అయన తరువాత పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ఘనత టీడీపీ అధినేత సియం చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు. శుక్రవారం పగిడ్యాల మండల పరిధిలోని ప్రాతకోట గ్రామంలో టిడిపి నాయకులు డాక్టర్ నాగ శేషులు, మాజీ సర్పంచ్ శేసమ్మ లు మరియు ఎన్టీఆర్ అభిమానులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, టిడిపి నేత మండ్రా సంయుక్తంగా అభిమాన టిడిపి కార్యకర్తల మధ్య ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు డాక్టర్ రమణ, డాక్టర్ కుమార్, టిడిపి మండల నాయకులు మరియు గ్రామ నాయకులు లక్ష్మాపురం గ్రామ నాయకులు షమిన్, కుమ్మరి గోవిందు, మద్దిలేటి గౌడ్, అయ్యన్న మరియు కార్యకర్తలు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయుని సన్నిధిలో ఆర్టీవో ఏవో సునీత ప్రత్యేక పూజలు..!

**పాణ్యం ప్రతినిధి. నంది పత్రిక.** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు నంద్యాల ఆర్టీవో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే. సునీత కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, ఆలయ అర్చకులు కంపమల్ల నారాయణస్వామి వారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు ఏవో కే.సునీత కుటుంబ సభ్యులకు పూలమాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# పన్నుల చెల్లింపులో పౌర బాధ్యతను పెంపొందించాలి..!

## జీఎస్టీ ఆదాయ వసూళ్లు, వృత్తి పన్ను అనుసరణపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్ష

## పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహించే సంస్థలపై చట్టపరమైన చర్యలు



**కడప,బ్యూరో చీఫ్ మే 29 నంది పత్రిక** : వ్యాపారులు మరియు వృత్తిదారులు స్వచ్ఛందంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకొని.. పౌర బాధ్యతగా పన్నులు చెల్లించేలా అవగాహన పెంపొందించి ద్వారా రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జీఎస్టీ అధికారులకు సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా వాణిజ్య పన్నుల శాఖ సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జి. సుమతి జిల్లాలో వాణిజ్య పన్నుల శాఖలో ఇప్పటి వరకు వసూలు అయిన పన్నుల మొత్తం, పెండింగ్ లో ఉన్న పన్నుల మొత్తం వివరాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాన ఆదాయ వనరులుగా నిలిచే పన్నులను ప్రతి వ్యాపారి, వృత్తిదారుడు, సంస్థ బాధ్యతాయుతంగా సకాలంలో చెల్లించాలని సూచించారు. ముఖ్యంగా ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లింపుపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రొఫెషనల్ ట్యాక్స్ చట్టం ప్రకారం వ్యాపారులు, దుకాణాలు, కంపెనీలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వైద్యులు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, కాంట్రాక్టర్లు, గోదాములు, ఏటీఎంలు, బ్యాంక్ శాఖలు, ఫైనాన్స్ సంస్థలు, మొబైల్ టవర్లు తదితర వాణిజ్య, వృత్తి సంస్థలు తప్పనిసరిగా నమోదు చేసుకొని వర్తించే పన్నును ప్రభుత్వానికి చెల్లించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.అలాగే యజమానులు తమ సంస్థలలో పనిచేసే ఉద్యోగుల జీతాల ఆధారంగా ఫారం-× కింద వృత్తి పన్ను వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. వ్యాపార సంస్థలు మరియు వృత్తిదారులు ఫారం-×× కింద, ఉద్యోగులపై వర్తించే పన్ను ఫారం-× కింద చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, పెండింగ్ బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖాధికారులు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రతి అర్హత కలిగిన సంస్థను ప్రొఫెషనల్ ట్యాక్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇటీవల కొన్ని బ్యాంకులు మరియు ఇతర పన్ను చెల్లింపుదారులు వృత్తి పన్నును సకాలంలో చెల్లించడం లేదని అధికారులు గుర్తించినట్లు సమావేశంలో ప్రస్తావించగా, ఇటువంటి సంస్థలు మరియు పన్ను చెల్లింపుదారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.వృత్తి పన్ను చట్టం కింద నమోదు పొందని వ్యాపారులు, వృత్తిదారులు మరియు సంస్థలు ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ట్యాక్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా నమోదు పొందవచ్చని అధికారులు తెలిపారు. నమోదు అనంతరం పన్ను చెల్లింపులు మరియు రిటర్నుల దాఖలు ప్రక్రియలను కూడా ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించవచ్చని వివరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కె. కేదారేశ్వరరావు, సహాయ రాష్ట్ర పన్నుల కమిషనర్ పి. పద్మావతి, సహాయ రాష్ట్ర పన్నుల కమిషనర్ రవి కుమార్ రెడ్డి, ఉప సహాయ రాష్ట్ర పన్నుల కమిషనర్ అనిత, ఉప సహాయ రాష్ట్ర పన్నుల కమిషనర్ శ్రీనివాసుల రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు .



# మహానాడు కాదు... మరో మహా నాటకం!

## ప్రజల సమస్యలపై మౌనం... స్వప్రచారమే లక్ష్యం


## డిసిసి అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** టీడీపీ నిర్వహించిన మహానాడు కార్యక్రమం రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కార వేదికగా కాకుండా, పూర్తిగా రాజకీయ ప్రచార వేదికగా మారిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ విమర్శించారు.రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, యువత అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఈ సమయంలో ప్రజల బాధలపై చర్చించకుండా, మహానాడును స్వప్రచార కార్యక్రమంగా మార్చడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇప్పుడు మళ్లీ కొత్త హామీల పేరుతో ప్రజలను మోసం చేయాలని ప్రయత్నించడం టీడీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఆశలు చూపించిన ప్రభుత్వం, సూపర్ ఫెయిల్ అయ్యి ఇప్పటివరకు వాటి అమలుపై స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హమన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన హామీలు నెరవేర్చకుండా, మహానాడులో మళ్లీ మాటల మాయాజాలం ప్రదర్శించడం ప్రజలను అవమానపరచడమేనన్నారు.రాష్ట్రంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మహిళల భద్రత, విద్యా మరియు వైద్య రంగాల సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, వాటిపై మహానాడులో ఎలాంటి చర్చ జరగకపోవడం బాధాకరమన్నారు. టీడీపీ మహానాడు ప్రజా సమస్యల పరిష్కార సభ కాకుండా, రాజకీయ డ్రామా, ప్రచార ఆర్భాటం, చప్పట్లు కొట్టించే కార్యక్రమంగా మాత్రమే మిగిలిపోయిందని విమర్శించారు. ప్రజలు ఇప్పుడు మాటలను కాదు, చేతలను నమ్మే పరిస్థితిలో ఉన్నారని, హామీలతో మోసం చేసే రాజకీయాలకు త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని క్రాంతి నాయుడు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వశీ భాష మొదలగు వారు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీకి వెళ్లిన వ్యక్తి మృతి

## మౌలిక వసతులు లేకనే వ్యక్తి మరణించాడని గ్రామస్తుల ఆవేదన



**కల్లూరు నంది పత్రిక...** శుక్రవారం ఉపాధి కూలికి వెళ్లిన మాదిగ హరి రాముడు, నా/నా మాదిగ మరన్న అను ఉపాధి శ్రామికుడు, కల్లూరు మండలం, ఉలిందకొండ పంచాయతీ, ఎర్రకత్వ గ్రామము నందు ఊరివంకలో పనికి వెళ్లాడు అక్కడ వసతులు సరిగ్గా లేక మృతి చెందారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రతకు అస్వస్థకు గురై పని ప్రదేశంలో విశ్రాంతి తీసుకుంటూ అకస్మాత్స్థితిలోకి వెళ్లి తోటి శ్రామికులు ఆటో లో కర్నూలు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కి తీసుకు వెళ్లగా డాక్టర్లు చనిపోయారని నిర్ధారించారు. మృత్యునికి భార్య ,కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారని గ్రామస్తులు తెలియజేశారు ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో కల్లూరు జి.నాగ శేషాచల రెడ్డి ఆదేశాల మేరకు ఏపీవో పి కుమార్ సాయినాథ్, టెక్నికల్ అసిస్టెంట్ ఎల్ రమేష్, సి వెంకటరమణ & మేట్ ఎర్రకత్వ గ్రామ మేట్ ఎం రంజిత్ మరియు నాగేశ్వరరావు ఉపాధి శ్రామికుని ఇంటికి వెళ్లి పరామర్శించి, ఉన్న విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయడమైనది.



# గ్రీవెన్స్‌ల పరిష్కారంపై శాఖల వారీగా కలెక్టర్ కఠిన ఆదేశాలు







### పెండింగ్ ఫిర్యాదుల క్లియరెన్స్‌కు వేగవంతమైన కార్యాచరణ
### “వన్ మంత్ - ఫోర్ విజిట్”కు ప్రజల నుండి విశేష స్పందన
### ప్రజలకు నేరుగా పరిష్కార పత్రాలు అందజేయాలి : కలెక్టర్ రాజకుమారి

**ఆళ్లగడ్డప్రతినిధి మే 29 నంది పత్రిక** ప్రజల నుండి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, జాప్యానికి తావులేకుండా తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. “వన్ మంత్ ఫోర్ విజిట్” కార్యక్రమంలో భాగంగా శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. మొదటి వారం 578, రెండో వారం 524 ఫిర్యాదులు అందగా, ఈ వారం ఇప్పటివరకు దాదాపు 400 ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపారు. మొత్తం మూడు వారాల్లో సుమారు 1500 వరకు గ్రీవెన్స్‌లు అందినట్లు పేర్కొన్నారు. వీటిలో సుమారు 400 సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన పెండింగ్ అంశాలను కూడా చివరి వారంలో పూర్తిస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యమన్నారు. మొత్తం 33 శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారుల వారీగా విభజించి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం కల్లా ఆయా శాఖల అధికారులు ఆర్డీఓలతో కలిసి సమీక్షా సమావేశాలు నిర్వహించి, ఇప్పటివరకు పరిష్కరించిన సమస్యలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

సమస్యలు పరిష్కారమైన లబ్ధిదారులను నేరుగా పిలిపించి, వెబ్‌ల్యాండ్ ధృవీకరణ పత్రాలు, ఎండార్స్‌మెంట్ కాపీలు తదితర ఆధారాలను వెంటనే అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దరఖాస్తులను చిన్నచిన్న కారణాలతో తిరస్కరించకుండా, ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖలో 22ఏ డివిజన్లు, డాటెడ్ లైన్స్ క్లియరెన్స్, మ్యుటేషన్లు, రాస్తా సమస్యలు, ఇనాం పట్టా అంశాలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ‘అన్నదాత సుఖీభవ’, ఎరువుల లభ్యత వంటి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్, పీడబ్ల్యూడీ, వాటర్ రిసోర్సెస్ శాఖలకు చెందిన మట్టి రోడ్లు, కల్వర్టులు, చిన్న వంతెనల నిర్మాణ ప్రతిపాదనలను త్వరితగతిన ప్రాసెస్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలీస్ శాఖ భూ వివాదాలను పెద్దల సమక్షంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈఓ మరియు సమగ్ర శిక్ష శాఖలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తాగునీరు, డెస్కులు, గ్రౌండ్ లెవెలింగ్ వంటి సమస్యలపై సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ బిల్లుల విడుదల, శానిటేషన్, తాగునీటి సమస్యలు, వైద్యుల కొరత వంటి అంశాలపైనా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ప్రజా గ్రీవెన్స్‌లను అధికారులు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతుందని, వచ్చే వారంలో కొత్త అర్జీల స్వీకరణకు పరిమిత సమయం కేటాయించి, ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఫీల్డ్ విజిట్ ఫోటోలు, లబ్ధిదారుల అభిప్రాయాలను సీఎం డ్యాష్‌బోర్డుకు పంపిస్తామని చెప్పారు. అధికారులు ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటే తన దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి ప్రజల నుండి సానుకూల స్పందన లభిస్తోందని, అధికారులు సమన్వయంతో పనిచేస్తే జిల్లా అభివృద్ధికి మరింత నిధులు సాధించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. చివరగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు మరియు అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి దిశా ప్రణాళికలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరంబ్యూరో చీఫ్ మే 29,నంది పత్రిక** నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి దిశా ప్రణాళిక (కన్స్టిట్యూన్సీ విజన్ ప్లాన్ )లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన ఫలితాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నియోజకవర్గ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలో ప్రతి పనిని నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా సిఎస్ఆర్ నిధుల ద్వారా చేపడుతున్న వైద్య పరికరాల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, రోడ్లు, డ్రైన్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, పనుల్లో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య, విద్య, మౌలిక సదుపాయాల రంగాల్లో చేపడుతున్న పనులు ప్రజలకు నేరుగా ఉపయోగపడే విధంగా ఉండాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల అమలులో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అలాగే “బడిపిలుస్తుంది” కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెంచాలని తెలిపారు. ఓటర్ల జాబితా మ్యాపింగ్ కార్యక్రమంపై కూడా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. బిఎల్వోలను సమన్వయం చేస్తూ వందశాతం మ్యాపింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితత్వంతో సాగేందుకు ఓటర్ల జాబితా సక్రమంగా ఉండడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో సీపీవో కె.శివ పార్వతి, సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ శ్రీనివాసరావు, డ్వామా పిడి డాక్టర్ కె సి హెచ్ అప్పారావు డిఎంహెచ్ఓ డా.జి.గీతాబాయి, జిల్లా ఆర్ అండ్ బి అధికారి ఎ.శ్రీనివాసరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైవే ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు







### రాత్రి వేళ ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక నిఘా
### రోడ్డు భద్రతపై అధికారులకు కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు

**ఆళ్లగడ్డప్రతినిధి మే 29 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణ పరిసర ప్రాంతాల్లోని జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా ఆదేశించారు. శుక్రవారం ఆళ్లగడ్డ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ చర్యల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్, ప్రాజెక్ట్ మేనేజర్ మదన్‌మోహన్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైవేలపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత డీఆర్ఎస్సీ సమావేశంలో సూచించిన చర్యల అమలుపై అధికారులు సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులకు సంబంధించిన ఫోటోలు, వివరాలను అందించాలని సూచించారు. హైవేలపై రేడియం లైటింగ్ లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై గత సమీక్ష సమావేశంలో సూచించినప్పటికీ ఇంకా లైటింగ్ ఏర్పాట్లు పూర్తి కాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాల్లో తక్షణమే రేడియం సైన్‌బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైవే పక్కన నిర్మాణంలో ఉన్న కల్యాణ మండప సముదాయాలకు క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే అనుమతులు జారీ కావడంపై కలెక్టర్ ప్రశ్నించారు. ప్రజల భద్రతకు భంగం కలగకుండా అన్ని అనుమతులు నిబంధనల ప్రకారమే ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట వాహనాలు నిర్లక్ష్యంగా నిలిపివేయడం, అనధికారికంగా ఏర్పడుతున్న దాబాలు కూడా ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని... ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు ఇప్పటికే కొన్ని అనధికార దాబాలను మూసివేసినట్లు తెలిపారు. ఈ తరహా అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.

తిరుపతి వైపు నుంచి వచ్చే వాహనదారులు రాత్రి వేళల్లో నిద్రమత్తులో ప్రయాణించడం, రాంగ్ రూట్‌లో రావడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని నేషనల్ హైవే పిడి వివరించారు. ఈ నేపథ్యంలో హైవేలపై ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఆర్ అండ్ బి రోడ్డు - హైవే కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు, తగినంత లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన కొన్ని పనులు కోర్టు పరిధిలో ఉన్న కారణంగా నిలిచిపోయినట్లు పీడీ కలెక్టర్‌కు వివరించారు. రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నిడమర్రు మండలంలో పెండింగ్లో ఉన్న పలుఅభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...
### ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు



**ఏలూరు/నిడమర్రు,బ్యూరో చీఫ్ మే 29నంది పత్రిక :** నిడమర్రు మండలం పెదనింద్రకొలను, చిననింద్రకోలను గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం పెండింగ్లో ఉన్న పలుఅభివృద్ధి కార్యక్రమాలు సుడిగాలి పర్యటనలు చేసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సంయుక్తంగా పరిశీలించారు. పెదనింద్రకొలను శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నికి నూతన భవనాల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని, పందికొడు వంతెన గుర్రపుడెక్కను తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. చిననింద్రకొలను మంచినీటి చెరువును మరమ్మట్లు చేయాలనీ, , శిధిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీ భవనం స్థానంలో కొత్తభవనానికి అనుమతులు మంజూరు చేయాలని, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో లెవెలింగు పనులు, ఉత్తర ప్రహరీ గోడ నిర్మాణంకు అనుమతులు, నిధులు మంజూరు చెయ్యాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టరు ఎమ్మెల్యే కోరిన పనులకు పూర్తస్థాయిలో నివేదికలు త్వరితగతిన అందించాలని, పనులు పూర్తి చెయ్యుటకు తనవంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యేకు జిల్లా కలెక్టరు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.లక్ష్మీ ప్రసన్న, సంబంధిత జిల్లా, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లపై నారా లోకేష్ చారిత్రాత్మక నిర్ణయానికి
# పాణ్యశీ ఎమ్మెల్యే టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి హర్షం

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** మహానాడు2026 వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ 2029 ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ప్రకటించడం మహిళా సాధికారత దిశగా ఒక చారిత్రాత్మక నిర్ణయమని పాణ్యశీ నియోజకవర్గం ఎమ్మెల్యే టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో మీడియా సమావేశంలో గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు తెలుగుదేశం పార్టీ ఎప్పటి నుంచో కట్టుబడి ఉందని తెలిపారు. మహానాడు2026లో నారా లోకేష్ చేసిన 33 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదన మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించే దిశగా ఒక విప్లవాత్మక అడుగని అన్నారు.దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఇంకా చర్చలు కొనసాగుతున్న తరుణంలో, చట్టబద్ధ అమలుతో సంబంధం లేకుండా పార్టీ పరంగా మహిళలకు 33 శాతం టికెట్లు కేటాయించాలని లోకేష్ ప్రకటించడం మహిళల పట్ల టీడీపీకి ఉన్న నిబద్ధతను చాటుతోందని పేర్కొన్నారు. మహానాడు వేదికగా ప్రకటించిన ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని అన్నారు. మహిళలు కుటుంబ, సామాజిక, ఆర్థిక రంగాల్లోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా కీలక పాత్ర పోషించాలని తెలుగుదేశం పార్టీ విశ్వసిస్తోందని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. మహిళలకు అధిక ప్రాధాన్యత, సమాన అవకాశాలు కల్పించడం ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమైన నిర్ణయం తీసుకున్న నారా లోకేష్ చంద్రబాబు నాయుడు కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రగతికి పునాది అనే సిద్ధాంతంతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.



## .నల్లగట్ల వద్ద రెండు రోడ్డు ప్రమాదాలు
### ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు

**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 29, నంది పత్రిక** ఆళ్లగడ్డ మండల పరిధిలోని నల్లగట్ల సమీపంలో శుక్రవారం పదినిమిషాల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. నల్లగట్ల సమీప రహదారిపై వేగంగా వెళ్తున్న వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. మొదటి ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే కూతవేట దూరంలో మరో ప్రమాదం చోటుచేసుకోవడంతో రహదారిపై భయాందోళన నెలకొంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఘటనపైరూరల్ సీఐ బివి రమణ ఎస్సై వరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





# టెక్స్ టైల్స్ హబ్ గా ఏపీ






**ఽంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్**

**నార ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం**

**2030 నాటికి 350 బిలియన్ డాలర్ల టెక్స్ టైల్స్ ఉత్పత్తుల ఎగుమతుల లక్ష్యం**

**బ్రాండింగ్ మాస్టర్ చంద్రబాబు**

**మోడి, చంద్రబాబు విజనరీ లీడర్లు : కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్**

**డబుల్ ఇంజన్ సర్కార్ తో ఏపీలో అభివృద్ధి పరుగులు : మంత్రి సవిత**

**గత ప్రభుత్వం రప్పా రప్పా తీసుకొస్తే...**

**కూటమి ప్రభుత్వం టెక్స్ టైల్స్, అపెరల్ పాలసీకి శ్రీకారం చుట్టింది**

**చేనేత, హస్త కళాకారులకు 365 రోజుల పాటు ఉపాధి కల్పిస్తాం : మంత్రి సవిత**

**విజయవాడబ్యూరో చీఫ్ :మే 29నంది పత్రిక** ఏపీని టెక్స్ టైల్స్ హబ్ గా అభివృద్ధి చేయనున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేయనుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. 2030 నాటికి 350 బిలియన్ డాలర్ల టెక్స్ టైల్స్ ఉత్పత్తుల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బ్రాండింగ్ కు మాస్టర్ సీఎం చంద్రబాబు అని, ఆయన నేతృత్వంలో అమరావతి నిర్మాణం తథ్యమని అన్నారు. మోడీ, చంద్రబాబు విజనరీ నాయకులని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రాను నిర్మిస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం నూతన టెక్స్ టైల్స్, అపెరల్ పాలసీ తీసుకొస్తే, గత ప్రభుత్వ పాలకులు రప్పా రప్పా పాలసీ అమలు చేశారంటూ వైసీపీని విమర్శించారు. విజయవాడలో ఓ హోటల్ లో రాష్ట్రంలో చేనేత, జౌళి శాఖ, సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులతో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో చేనేత, హస్త కళల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. చేనేత, హస్త కళాకారులకు 365 రోజుల పాటు ఉపాధి కల్పిస్తూనే, పర్యావరణ పరిరక్షణకు నార ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు. అరటి, పైనాపిల్, చెరకు నారలతో ఉత్పత్తుల తయారీకి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏపీని టెక్స్ టైల్స్ హబ్ గా అభివృద్ధి చేయాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. 2030 నాటికి దేశం నుంచి 350 బిలియన్ డాలర్ల టెక్స్ టైల్స్ ఉత్పత్తుల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.సీఎం చంద్రబాబు అంటేనే గుర్తుకొచ్చేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. దేశాభివృద్ధిలో చంద్రబాబు పాత్ర ప్రశంసనీయమన్నారు. ప్రధాని నరేంద్రమోడి, సీఎం చంద్రబాబు విజనరీ నాయకులన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అమరావతి రాజధాని నిర్మాణం తథ్యమన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందన్నారు. పెట్రోల్ ధరలు మనదేశంలోనే స్వల్పం పెరుగుదల పశ్చిమాసియా, రష్యా - ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరలు అమాంతంగా పెరిగాయని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో కంటే ఇండియాలోనే పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరిగాయన్నారు. భారత్ లో లీటర్ పై రూ.10లు పెరిగితే, అమెరికాలో 44 శాతం మేర ధరలు పెరిగాయన్నారు. ఫ్రాన్స్, చైనాలోనూ ఇంధన ధరలు భారీ ఎత్తున పెరిగాయన్నారు. భారత్ లో యువత అధికంగా ఉందని, యువ భారత్ అండతో త్వరలోనే విశ్వ గురుగా ఆవిర్భవించనున్నామని కేంద్రమంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు.

**కేంద్రం సహకారంతో నార ఉత్పత్తులకు ప్రోత్సాహం : మంత్రి సవిత** డబుల్ ఇంజన్ సర్కార్ తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏపీలో చేనేత, హస్త కళల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అరటి, చెరకు, పైనాపిల్ నారలతో ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం అందివ్వడానికి కేంద్ర జౌళి శాఖ ముందుకొచ్చిందన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దే లక్ష్యలో భాగంగా నారా ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రాను నిర్మిస్తామని మంత్రి సవిత తెలిపారు. గత ప్రభుత్వం రప్పా రప్పా పాలసీని తీసుకొస్తే, తమ ప్రభుత్వం చేనేత, హస్తకళల అభివృద్ధికి టెక్స్ టైల్స్, అపెరల్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. అనంతరం కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ను, మంత్రి సవితను చేనేత, జౌళి శాఖ, సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు హోటల్ లో ఏర్పాటు చేసిన చేనేత, హస్త కళల స్టాళ్లను మంత్రి సవితతో కలిసి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పరిశీలించారు. చేనేత, హస్త కళారూపాల తయారీ, వాటి ప్రాచుర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్లా, ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోండి

**టీడీపీని వెన్నుపోటు పార్టీగా ప్రజలు గుర్తిస్తున్నారు**

**వైఎస్ఆర్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్వీ మోహన్ రెడ్డి**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలుగుదేశం పార్టీ చరిత్ర వెన్నుపోటు రాజకీయాలకు ప్రతీకగా నిలిచిందని, అందుకే టీడీపీని వెన్నుపోటు పార్టీగా ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. మహానాడు కార్యక్రమం ప్రజా సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై చర్చించడానికి కాకుండా, వైఎస్ఆర్సీపీ మరియు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని విమర్శించడానికే పరిమితమైందని విమర్శించారు.వైఎస్ఆర్సీపీ గొడవలు, కక్షసాధింపుల రాజకీయాలు చేసే పార్టీ కాదని, సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన పార్టీ అని పేర్కొన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని అన్నారు.ఎన్నికల సమయంలో మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాల్సిన టీడీపీ నాయకులు, మహానాడు వేదికగా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడానికే పరిమితమవుతున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, విమర్శల రాజకీయాలను విడనాడి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం- 2026 బ్రోచర్ ఆవిష్కరణ..!



**కడప,బ్యూరో చీఫ్ మే 29:నంది పత్రిక** రాబోయే ప్రపంచ పర్యావరణ దినోత్సవం2026 సందర్భంగా "ఇన్స్పైర్డ్ బై నేచర్ . ఫర్ క్లైమేట్ . ఫర్ ఆవర్ ఫ్యూచర్ ." అనే అంతర్జాతీయ థీమ్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో అవగాహన బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఏ పి పి సి బి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. భవిష్యత్ తరాల కోసం ప్రకృతి సంపదలను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని పేర్కొన్నారు.బ్రోచర్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తగ్గింపు, నీరువిద్యుత్ సంరక్షణ, పర్యావరణహిత రవాణా విధానాలు, 3= సూత్రాలు (రెడ్యూస్ , రేస్ , రిసైకిల్ ), వృక్షారోపణ మరియు ప్రజల భాగస్వామ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, వృక్షారోపణ కార్యక్రమాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించనున్నట్లు ఏ పి పి సి బి ప్రాంతీయ అధికారి సుధా కురుబా తెలిపారు.

## సీఎం సహాయనిధి పేదల పాలిట వరం.. ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.. సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.5.22 లక్షల విలువైన చెక్కులను పంచలింగాలలోని ఆయన నివాసంలో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరాముడు పాల్గొన్నారు..

# థాంక్యూ నారా లోకేష్ అన్న అంటూ సంబారాలు నిర్వహించిన మహిళా నాయకులు .







**మహానాడు సభలో మహిళలకు రాబోయే ఎన్నికల్లో 33% సీట్లను కేటాయిస్తామన్న ప్రకటన మహిళా సాధికారతకు చారిత్రాత్మక నిర్ణయం**

**నంద్యాలలో టీడీపీ మహిళా నాయకుల సంబరాల్లో పాల్గొన్న జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి**

**నంద్యాల సిటీ బ్యూరో మే 29 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 శాతం రాజకీయ రిజర్వేషన్ ప్రకటించిన నారా లోకేష్ గారి నిర్ణయాన్ని స్వాగతిస్తూ నంద్యాల తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా సంబరాల్లో పాల్గొని కేక్ కట్ చేసి జిల్లా మహిళలందరికి శుభాకాంక్షలు తెలిపి నారా లోకేష్ కు ధన్యవాదములు తెలియజేశారు.ఈ సందర్భంగా గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా నిలిచిందని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పూర్తిస్థాయిలో అమల్లోకి రాకముందే ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు 33% రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని మహానాడులో తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.మహిళల అభ్యున్నతికి విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, భద్రత వంటి అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గతంలో మహానేత నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తి హక్కుల్లో సమాన వాటా కల్పించి మహిళా గౌరవాన్ని పెంచారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలు, మహిళ సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది మహిళలకు ఆర్థిక బలోపేతం కల్పించారని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ఆమె వివరించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా 12 లక్షల స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ సుమారు 1.12 కోట్ల మంది మహిళలకు ప్రయోజనం చేకూరుస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళలకు వేల కోట్ల ఆర్థిక సహాయం అందుతోందని పేర్కొన్నారు.అలాగే " స్త్రీ శక్తి" పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం మహిళల గౌరవాన్ని మరింత పెంచిందన్నారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించడమే టీడీపీ లక్ష్యమని గౌరు చరిత రెడ్డి తెలిపారు.రాబోయే ఎన్నికల్లో మహిళలు మరింత ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజా సేవలో కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళలకు ఇచ్చిన 33% రిజర్వేషన్ హామీ భవిష్యత్ రాజకీయాల్లో మహిళలకు స్వర్ణయుగానికి నాంది అవుతుందని పేర్కొన్నారు.మహానాడులో మహిళలకు 33% రిజర్వేషన్ ప్రకటించడంతో నంద్యాల మహిళా టీడీపీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మెన్, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ జిల్లెల్ల శ్రీదేవి,జిల్లా కమిటీ సభ్యులు ప్రసన్న రెడ్డి,సౌభాగ్యవతి, నంద్యాల మహిళ విభాగం అధ్యక్షురాలు విజయ గౌరీ, బైరెడ్డి శంకరమ్మ, పద్మావతి,భారతి రెడ్డి, నాగ రత్నమ్మ మరియు మహిళ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పాలిసెట్ సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ప్రారంభం.

**కేసముద్రం, మే 29(నంది పత్రిక):** పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ శుక్రవారం ప్రారంభం అయిందని కేసముద్రం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఈగ మల్లికార్జున్ తెలిపారు. మే 27 నుండి ఆన్లైన్ దరఖాస్తులు, ఫీజు చెల్లించిన విద్యార్థులకు శుక్రవారం నుండి సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



# మోదీని రాహుల్ జయించగలడా?

గత సార్వత్రక ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకు యువ కాంగ్రెస్ శాసనసభ్యుడు ఒకరు నాకు తటస్థించారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీకి ఐదు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. నేను ఇవ్వగల సలహా ఒక్కటే ఉన్నదని చెప్పాను: వయనాడ్ నుంచి లోక్‌సభకు ప్రియాంకగాంధీ పోటీ చేయకూడదు. నా యీ సలహాను నిర్లక్ష్యం చేస్తారని నిశ్చితంగా చెప్పగలను అని ముక్తాయించాను. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఆయన నాయకత్వం పట్ల విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా భాసించారు. అయితే సార్వత్రక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ జమీగా అయిపోవడంతో భారత్ జోడో యాత్ర సత్ఫలితాలు వ్యర్థమైపోయాయి. ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక వాగాడంబరం ప్రదర్శించారు. 2024 సార్వత్రక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను ప్రధానమంత్రి కాబోయే వ్యక్తి అని కీర్తించడం ప్రారంభించారు. దేశ రాజధాని న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనతో ఏకీభవించారు. రెండు సంవత్సరాల తరువాత వెనుతిరిగి చూస్తే వారి ఆనందోత్సాహాలు తొందరపాటుతో కూడుకున్నవని అనిపిస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కేవలం ఒకే ఒక్క రాష్ట్రం కేరళలో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. ఒకప్పుడు కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న గుజరాత్, మధ్యప్రదేశ్, హర్యానాలో బీజేపీ స్వతస్సిద్ధ పాలకపక్షంగా భాసిల్లుతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేకపోతున్నారు. 2008లో కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆయన లాంఛనంగా చేపట్టినప్పుడు దేశ వ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శాసనసభ్యుల సంఖ్య 1204 నుంచి ఇప్పుడు 676కి పడిపోయింది.రాహుల్‌గాంధీని స్వయంగా కలిసి మాటా మంతీ జరిపాను. ఆయనతో నేను ఉత్తర ప్రత్యుత్తురాలూ సాగించాను. జవహర్‌లాల్ నెహ్రూ మునిమనవడు సద్వర్తనుడు, సందేహం లేదు. ఈ కొద్ది పాటి పరిచయం కూడా లేకపోయినప్పటికీ ఆయన పట్ల నాకు అపార సానుభూతి ఉండేది. ఆయన లోనైన వ్యక్తిగత విషాదాలే ఆ సానుభూతిని కలిగించాయి. యాభై ఐదు సంవత్సరాల వయసులో ఉన్న రాహుల్ తన తల్లి సంకల్పసాధనకు ఒక సాధనంగా మిగిలిపోయాడు. సోనియాగాంధీ ఆదేశం మేరకే ఆయన రాజకీయాలలో ప్రవేశించారనే విషయంలో ఎవరికీ సందేహం లేదు. ఆమె చెప్పిన విధంగానే కాంగ్రెస్‌కు సారథ్యం వహిస్తున్నారు. అయితే మన గణతంత్ర రాజ్యం మౌలిక విలువలు, మనుగడ ప్రమాదంలో పడిన ప్రస్తుత సందర్భంలో ప్రజాచర్చ మారాలి. అది స్పష్టంగా, కఠినంగానే కాకుండా క్రూరంగా కూడా జరగాలి. రాహుల్‌గాంధీ మంచి మనిషి, ఉత్తమ భారతీయుడే. అయితే బీజేపీ విద్వేషపాలనను అంతమొందించేందుకు ఆరాటపడుతున్నవారు తమ ప్రధాన ఆశాజ్యోతిగా రాహుల్‌ను చూడడాన్ని మానుకోవడం మంచిది. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీకి భావి సవాల్‌దారు అయిన రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు కొరవడ్డాయి. ఎన్నికల సంఘం పక్షపాత కార్యసరళి లాంటి సమస్యపై కూడా ఆయన నిర్విరామంగా పోరాడలేదు. 'ఓటు చోరీ'పై ఒకరోజు విలేఖర్ల సమావేశంలో పాల్గొని, మరుసటి రోజే యూరోప్ లేదా లాటిన్ అమెరికాకు వెళ్లిపోవడాన్నే దేశ ప్రజలు చూశారు. తన 22 ఏళ్ల రాజకీయ జీవితంలో భారత్ జోడో యాత్ర చేసిన కొద్ది నెలలు మాత్రమే ప్రజాసమస్యలపై ఆయన తదేక దీక్షతో శ్రద్ధ చూపడం జరిగింది. బీజేపీ నాయకులు అటువంటి దీక్షతో 365 రోజులూ రేయింబవళ్లు పనిచేస్తుంటారు. ఈ రోజుల్లో ఆయన తన రాజకీయ కార్యకలాపాలను చాలావరకు సామాజిక మాధ్యమాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఆయన పోస్ట్‌లకు వెన్వెంటనే లైక్‌లు వెల్లువెత్తుతాయి. అయితే ఆయన వ్యాఖ్యలు 24 గంటలలోపే పూర్తిగా విస్మృతమయిపోతున్నాయి! 2004లో లోక్‌సభ సభ్యుడుగా ఎన్నికవక ముందు రాహుల్ ఎక్కడైనా ఏదైనా ఉద్యోగం చేశారా లేదా అన్నది ఎవరికీ తెలియదు. యూపీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో మంత్రిపదవిని చేపట్టేందుకు ఆయన అంగీకరించలేదు. మరి ఆయన ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు ఎందుకు విశ్వసించాలి? గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని చేతకానితనం రాహుల్‌కు ఉన్నది. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధానమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని రాహుల్ కొనసాగిస్తున్నాడు.

సందర్భవశాత్తు చాలా మంది పట్టించుకోని ఒక వాస్తవాన్ని చెప్పవలసి ఉన్నది: అధికారం వంశపారంపర్య హక్కు కాదనే విషయాన్ని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు నిరూపించాయి. అసోంలో తరుణ్ గొగోయ్ కుమారుడు కాంగ్రెస్ ప్రచారానికి నాయకత్వం వహించడం బీజేపీ విజయానికి దోహదం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్‌కు అగ్రప్రాధాన్యమివ్వడం ఆమెకే నష్టదాయకమైనది. తమిళనాడులో స్టాలిన్ తన కుమారుడు ఉదయనిధిని అందలాలు ఎక్కించడం విజయ్ విజయానికి విశేషంగా తోడ్పడింది. కేరళలో పినరయి విజయన్ తన అల్లుడిని ప్రమోట్ చేయడం కాంగ్రెస్ విజయానికి సహాయపడింది. ఆయా పార్టీల జయాపజయాలకు ఇంకా చాలా కారణాలు ఉన్నప్పటికీ వంశపారంపర్య రాజకీయాలకు ప్రజల తిరస్కృతి వాటిలో మరింత ముఖ్యమైనది.కాంగ్రెస్ పార్టీ ప్రథమ కుటుంబంపై ఈ విమర్శలు, కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఏ విధంగాను సమర్థించడం కానే కాదు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలు, ప్రజా వ్యవస్థలను ఎలా నిస్సారం చేస్తోందో, మీడియాను ఎలా బెదిరిస్తూ వస్తోందో, న్యాయవ్యవస్థను ఎలా లొంగదీసుకున్నదో, ప్రజాస్వామ్య ప్రక్రియలను ఎలా బలహీనపరుస్తోందో, మైనారిటీలను ఎంత నిర్దాక్షిణ్యంగా అణచివేస్తోందో, అనుసరిస్తున్న విదేశీ విధానం ఎంత లోపభూయిష్టమైనదో, వైజ్ఞానిక పరిశోధనలకు వాటిల్లుతోన్న నష్టాన్ని ఆశ్రిత పెట్టుబడిదారులకు ఎలా లబ్ధి చేకూర్చుతున్నదీ, మన అడవులు, నేలలు, జలవనరులను ఎలా ధ్వంసం చేస్తుందో నేను ఎప్పటికప్పుడు సవివరంగా వ్యాఖ్యానిస్తూ వస్తున్నాను. మే 2014 నుంచి మన గణతంత్ర రాజ్యం ఇలా భ్రష్టమవుతుండడానికి ప్రధాన కారకులు నరేంద్ర మోదీ, అమిత్ షా, వారి ఆధ్వర్యంలోని బీజేపీ. ఈ నాయక ద్వయం అధికారాన్ని స్వాధీనం చేసుకుని సుస్థిరం చేసుకోవడంలో ఉద్దేశపూర్వకంగానో, అనుద్దేశపూర్వకంగానో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ వారి విధేయులు ఆ ఉభయులకూ సహాయపడుతున్నారనే వింత వాస్తవం ఇప్పుడు స్పష్టంగా కనపడుతున్నది.మన భారత్ భవిష్యత్తేమిటి? నేనేమీ నిరుత్సాహపడడం లేదు. నిరాశాపూరిత వ్యాఖ్యతో నేను ఈ వ్యాసాన్ని ముగించబోవడం లేదు. నిజమే, మోదీ నాయకత్వంలో బీజేపీ ఇప్పుడు ఒక అజేయ శక్తిగా విలసిల్లుతున్నది. ఆ మాటకొస్తే హంగరీలో విక్టర్ ఓర్బాన్, ఆయన నాయకత్వంలోని ఫిడెజ్ దశాబ్దాల పాటు రాజ్యమేలలేదూ? చివరకు ఏమయింది? ఎవరికీ అంతగా తెలియని పీటర్ మాగ్యార్, ఆయన నాయకత్వంలోని టిస్జా పార్టీ ఓర్బాన్‌ను పదవీచ్యుతుణ్ణి చేశాయి. కొమ్ములు తిరిగిన రాజకీయ నాయకులు, సువ్యవస్థిత ప్రతిపక్షాలు సాధించలేనిదానిని మాగ్యార్ సాధించారు. ఇతర విపక్ష నేతలకు సంస్థాగత సాధనాలు రాజకీయ వేదికలు ఉన్నప్పటికీ మాగ్యార్ దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నిర్విరామంగా పర్యటిస్తూ సామాన్య ప్రజలను సమీకరించి, సమైక్యపరిచి అంతిమ విజయాన్ని సాధించారు. పీటర్ మాగ్యార్ లాగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ తామెదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులను ధిక్కరించి కదనశంఖం పూరిస్తారని ఆశించగలమా? 2029 సార్వత్రక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ దేశంలో రాజకీయ చర్చలు ముస్లిం విద్వేష రాజకీయాల నుంచి ఆర్థిక వాస్తవాల వైపు తప్పక మళ్లుతాయి.

ఆ విద్వేష రాజకీయాలు జీవన వ్యయాలను తగ్గించవని, గౌరవప్రదమైన ఉపాధిని కల్పించబోవని, తమ పిల్లలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వబోవనే సత్యాన్ని మరింత మంది హిందువులు తప్పక గుర్తిస్తారు. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం ఇప్పటికే ఆ సత్యాన్ని ఘోషించలేదూ? అధికార పార్టీ అసత్య ప్రచారాలను యువ భారతీయులు ఇంకెంత మాత్రం విశ్వసించడం లేదని 'బొద్దింకల' ఉద్యమం నిరూపించింది. మోదీ సర్కార్ పాలన పట్ల ప్రజల అసంతృప్తి మరింత తీవ్రమయినప్పుడు దానిని ఒక ప్రభావశీల రాజకీయ శక్తిగా పరిణమింపచేసేది ఎవరు? ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు జాతి ఆర్థిక, సామాజిక పునరుజ్జీవానికి నిర్మాణాత్మక కార్యక్రమాలను దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నివేదించగల నాయకుడు లేదా నాయకులు ఎవరు? జవహర్‌లాల్ నెహ్రూ ముని మనవడు లేదా ముని మనవరాలు గానీ లేదా వారిరువురు గానీ అటువంటి ఉత్తేజకర రాజకీయ చైతన్యాన్ని పురిగొల్పడం అసంభవంగా కనిపిస్తోంది. ఎన్నికల రాజకీయాలలో వారి గత రికార్డే ఈ అభిప్రాయానికి తావిచ్చింది.

# కొత్త రాజకీయుల కలకలం

కాక్రోచ్ (బొద్దింక) అనే నామవాచకం ఒక చెడ్డ పదం లేదా దుర్భాష కాదు. బొద్దింకల దేహ మౌలిక నిర్మాణం ఇంచుమించు 200 మిలియన్ సంవత్సరాలుగా ఒకే తీరున ఉన్నదని, మూడు లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికాలో హోమో సెపియన్స్ తొట్టతొలుత ఆవిర్భవించడానికి 199,700,000 సంవత్సరాలకు పూర్వమే బొద్దింకలు ఉనికిలో ఉన్నాయని వికీపిడియా వెల్లడించింది. చెప్పవచ్చినదేమిటంటే ఈ ధరిత్రిపై మానవుల కంటే బొద్దింకలకే చాలా పురాతన చరిత్ర ఉన్నది. మనుగడ సాగించేందుకు మానవుల కంటే వాటికే తొలి హక్కు ఉన్నదనేది స్పష్టం. బొద్దింకలు కరవవని, కొరకవని, కాటువేయవని సైన్స్ ఎన్‌సైక్లోపీడియా తెలియజేసింది. బొద్దింకలపై దాడిచేసే వారిలా అవి ఎవరిపైన దాడి చేయవని ఆ విజ్ఞానసర్వస్వం పేర్కొంది. బొద్దింకల దేహాలపై సూక్ష్మజీవులు అపారంగా ఉంటాయి. బొద్దింకలూ వ్యాధులను సంక్రమింపజేస్తాయి. మానవుల శరీరాలు కూడా సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పించేవే. సరే, మానవులు వ్యాధులను, ముఖ్యంగా ముఖ్యంగా శత్రు సమూహాలలోని వారికి సంక్రమింపచేస్తారని మరి చెప్పనవసరం లేదు. కొంతమంది మానవులు ఇతర మానవులను పురుగులుగా చూసినట్టే కొంత మంది మనుషులు బొద్దింకలను పాకేపురుగులుగా, గగుర్పాటు కలిగించేవిగా చూస్తారు.కొద్ది రోజుల క్రితం ఒక పెద్ద మనిషి బొద్దింకలను కలత నిద్ర నుంచి మేల్కొలిపారు. అయితే ఆ వెన్వెంటనే తాను నకిలీ న్యాయశాస్త్ర డిగ్రీలతో కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారి గురించి వ్యాఖ్యానించానని ఆయన వివరణ ఇచ్చారు. చెడ్డ పేర్లతో పిలిచేందుకు నకిలీ న్యాయవాదులు అర్హులే. అయితే బొద్దింకలుగా మాత్రం వారిని పిలవకూడదని నేను సవినయంగా కోరుతున్నాను. ఆ పెద్ద మనిషి పుణ్యమా అని మేల్కొన్న అపూర్వ బొద్దింకలు చైతన్యశీలమయ్యాయి. కొన్ని బొద్దింకలు ఒక రాజకీయ పార్టీని స్థాపించాయి. సామాజిక మాధ్యమం ఎక్స్ హ్యాండిల్ నొకదాన్ని ప్రారంభించాయి. ఒక వెబ్‌సైట్‌ను సృష్టించాయి. ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ నొకదాన్ని కూడాప్రారంభించాయి. చివరి గణన ప్రకారం ఈ బొద్దింకల హ్యాండిల్‌కు 2.20కోట్ల మంది అనుయాయులు ఉన్నారు.చైతన్యశీలమైన బొద్దింకలు ప్రతీకారానికి దిగాయి. కాక్రోచ్ జనతా పార్టీ అనే ఆన్‌లైన్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ డీప్కే అనే 30 ఏళ్ల యువకుడు ప్రారంభించిన ఎక్స్ హ్యాండిల్ బొద్దింకల ప్రతీకారచర్యలకు ఆలంబన అయింది. పర్యవసానంగా మానవుల్లోను కలకలం రేగింది. కొంత మంది వణికిపోయారు. కొల్హాపురి పాదరక్షలు ధరించేవారు మరీ అల్లాడిపోయారు. కాకపోతే. అపార సైనిక బలం ఉన్న భారతదేశ అత్యున్నత కార్యనిర్వాహణాధికారి ఆ ఎక్స్ హ్యాండిల్‌ను మూసివేయాలని అడగడమేమిటి? అభిజిత్ మన ఫ్రెన్మీ (ఫ్రెండ్ ఎనిమీ స్నేహితుడు శత్రువు) డోనాల్డ్ మహాశయుడి సంరక్షణలో ఉన్న ఒక అమెరికన్ విశ్వవిద్యాలయంలో 'పబ్లిక్ రిలేషన్స్'లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నారు. ఏర్పాటు చేసిన సీజేపీ లక్ష్యాలు ఏమిటో ఆ పార్టీ వెబ్‌సైట్ ఇలా పేర్కొంది: 'బొద్దింక గుర్తింపును మేము సొంతం చేసుకుంటున్నాంయువత తమ గొంతు వినిపించేందుకు అదే అవసరమైతే...' వ్యవస్థ పరిగణనలోకి తీసుకోవడాన్ని మరచిపోయిన ప్రజలకు ప్రాతినిధ్యం వహిండమే తమ లక్ష్యమని సీజేపీ లక్ష్యమని అభిజిత్ స్పష్టం చేశారు. తన ఎక్స్ హ్యాండిల్‌కు 'సోమరిపోతుల, నిరుద్యోగుల గొంతు' అనే ట్యాన్‌లైన్ నిచ్చాడు. గాంధీ, అంబేద్కర్, నెహ్రూ నుంచి స్ఫూర్తి పొందిన యువకుడు అతడు. సీజేపీ మేనిఫెస్టో చదివిన వారిని నవ్విస్తుంది, ఆలోచింపచేస్తుంది.దేశ ప్రజలలో ముఖ్యంగా యువ మహిళలతో సహా యువతలో విస్తృతంగా నెలకొనివున్న నిరాశా నిస్పృహలు, అపనమ్మకాలు, ఆశాభంగాలపై సీజేపీ ఆధారపడుతోంది. ఈ విపరీత, పరిస్థితులకు కారణాలను నిశితంగా చూద్దాం. నిరుద్యోగిత: మొత్తం ప్రజల్లో నిరుద్యోగం రేటు 5.2శాతం; యువజనుల నిరుద్యోగం రేటు 16 నుంచి 17శాతం. శ్రామిక శక్తి 64.3 కోట్లు; ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొంటున్నవారు మొత్తం కార్మికులలో 60శాతం మంది మాత్రమే. మిగతా 40శాతం మంది అంటే 25 కోట్ల మంది బొద్దింకలు (క్షమించాలి). సమస్త బొద్దింకల ఓట్లను సీజేపీ కైవసం చేసుకోగలిగితే ప్రభుత్వాన్ని అదే ఏర్పాటు చేయడం ఖాయం (2024 లోక్‌సభ ఎన్నికలలో పోలయిన మొత్తం ఓట్లలో బీజేపీకి 23.6 కోట్లు, కాంగ్రెస్‌కు 13.7 కోట్లు లభించాయి). పెట్రోల్, డీజిల్: నిరంతర గమనమే బొద్దింకలకు జీవన వనరు. పెరిగిపోయిన ఇంధన ధరలు బొద్దింకల గమనాన్ని పరిమితం చేసింది. ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12 కాగా డీజిల్ ధర రూ.95.20. బీజేపీకి ఓటు వేసిన పాపానికి గాను కోల్‌కతా వాసులకు ఆ ధరలను వరుసగా రూ.113.51, రూ.99.82గా నిర్ణయించారు!ఫ్యాక్టరీలలో ఉద్యోగాలు: బొద్దింకలు స్వతహాగా సోమరిపోతులు. ప్రతి ఉదయమూ ఇరుగు పొరుగు ప్రదేశాలలో శాఖా సమావేశానికి హాజరయ్యేందుకు త్వరగా లేచేందుకు శ్రద్ధ చూపనందున ప్రభుత్వోద్యోగాలకు వారు అనర్హులైపోయారు. ఇక వారికి అందుబాటులో ఉండే ఉద్యోగం ఫ్యాక్టరీ ఉద్యోగం. అధికారిక సమాచారం ప్రకారం మన దేశంలో 2,60,061 నమోదైన ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలలో 1.95 కోట్ల ఉద్యోగాలు ఉన్నాయి. కృత్రిమ మేధ వినియోగం పెరిగిపోయినందున వాటిలో చాలా భాగం అనావశ్యకమైనవే. తత్కారణంగా 35 కోట్ల బొద్దింకలకు ఫ్యాక్టరీ ఉద్యోగం లభించే అవకాశం లేనే లేదు. మరి ఆ బొద్దింకలు ఆశాభంగానికి గురి కాకుండా ఎలా ఉంటాయి?కుటుంబ మద్దతు: బొద్దింకలను కుటుంబాలే పోషిస్తుంటాయి. ఇందుకు ప్రతిగా వారు నెలనెలా ఐదు కిలోల ఉచిత తిండిగింజలను కుటుంబానికి సమకూరుస్తుంటారు. కుటుంబాల రుణభారం జీడీపీలో 42శాతంగా ఉండగా పొదుపుల మొత్తం జీడీపీలో కేవలం 5 నుంచి 6శాతం మాత్రమే బొద్దింకలకు కుటుంబాల నుంచి నగదు సహాయం అందదు. నగదురహిత జీవులవి.వికసిత భారత్ బిలియనీర్: వికసిత భారత్‌లో బిలియనీర్లు అయ్యేందుకు బొద్దింకలు ఆరాటపడుతున్నాయి. పన్నెండు సంవత్సరాల బీజేపీ పాలన తరువాత కూడా బిలియనీర్ల పెరుగుదల నత్త నడకలో న్నది. తాజా లెక్క ప్రకారం వారి సంఖ్య 205 మాత్రమే. బిలియనీర్లు అయ్యేందుకు 25 కోట్ల బొద్దింకలు వేచివున్నాయి. 2014లో వాగ్దానం చేసిన రూ.15 లక్షల అచ్చేదిన్ ఆగమనానికి కళ్లు పెద్దవి చేసుకుని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నాయి.బొద్దింకలు బొద్దింకల ఆర్థిక సలహాదారును ఆశ్రయించాయి (కాక్రోచెస్ ఎకనామిక్ అడ్వైజర్ సీఈఏ). సీఈఏ సలహా నిరాశాజనకంగా ఉన్నది: '2027 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య లోటు మరింతగా పెరుగుతుంది. అలాగే కరెంట్ ఖాతా లోటు కూడా. ద్రవ్యోల్బణం చిక్కులు మరింతగా ఉధృతమవుతాయి. రుతుపవనాలు సాధారణం కంటే తక్కువగా వర్షిస్తాయి. ఆహార ధాన్యాల సరఫరా అవసరాల మేరకు ఉండదు. ఈ పరిస్థితుల్లో విశ్వసనీయ పన్నుల విధానం ద్వారా దీర్ఘకాలిక పెట్టుబడులను ఆకర్షించే ముమ్మర ప్రయత్నాలు చేయడం అవశ్యం' సీఈఏ సలహా ముంచుకొస్తున్న ఆర్థిక విపత్తును స్పష్టంగా సూచించింది.

ఆర్థిక విపత్తును నిరోధించడమెలా? బొద్దింకలు మేధామథనం చేస్తున్నాయి. ఎన్నికల సంఘం ప్రధానాధికారి సహాయంతో మానవుల నుంచి బొద్దింకలకు శాంతియుతంగా అధికార బదిలీకి ప్రయత్నించమే ఏకైక మార్గమని బొద్దింకలు నిర్ణయించవచ్చు.

## టిపిటిఎఫ్ ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి దిక్సూచి లాంటిది.

### కేసముద్రంలో టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహణ.

### పతాకావిష్కరణ చేసిన సీనియర్ ఉపాధ్యాయులు చీకటి వెంకట్రాం నర్సయ్య.



**కేసముద్రం, మే 29(నంది పత్రిక):** ప్రభుత్వ ఉపాధ్యాయులకు అందని ద్రాక్షలా మిగిలిపోతున్న పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని, ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న నూతన నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఎలాంటి షరతులు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల కమిటీ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిపిటిఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టిపిటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, మండల కమిటీ నిర్మాణ బాధ్యులు, ఈనెలలోనే ఉద్యోగ విరమణ పొందుతున్న సీనియర్ ఉపాధ్యాయులు చీకటి వెంకట్రాం నర్సయ్య మండల కమిటీ నిర్ణయం మేరకు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గత నలభై సంవత్సరాలుగా టిపిటిఎఫ్ సంఘానికి సేవలు అందించి రిటైర్ కాబోతున్న చీకటి వెంకట్రాం నర్సయ్యను మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టిపిటిఎఫ్ కేసముద్రం మండల అధ్యక్షులు గుండు సురేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కుల సాధన, ప్రభుత్వ విద్యా పరిరక్షణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా టిపిటిఎఫ్ ఏర్పడిన నాటి నుండి నిరంతర పోరాట పంథాలో ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపు, ఉపాధ్యాయుల గౌరవ పరిరక్షణలో సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు అనేక పరిపాలనా ఒత్తిళ్లు, బోధనేతర పనుల భారం, ఖాళీ పోస్టులు, పెండింగ్ సమస్యలు, పదోన్నతులు ఆలస్యం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, పెండింగ్లో ఉన్న ఐదు డిఏ లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నర్సింహరాజు, సీనియర్ నాయకులు, స్టేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బందెల రాజు, మండల కమిటీ నిర్మాణ బాధ్యులు చీకటి వెంకట్రాం నర్సయ్య, ఉపాధ్యక్షులు కొమ్ము రాజేందర్, సంద్ర రాధిక, కార్యదర్శులు వీసం నర్సయ్య, జీ.మోహనకృష్ణ, బొల్లెద్దు చందర్, జిల్లా కౌన్సిలర్ ముదిగిరి సదయ్య, అకడమిక్ సెల్ కన్వీనర్ జి.శ్రీనివాస్, కమిటీ సభ్యులు కుసుమ సంతోష్, ఎస్.అనిత, వి.స్వర్ణలత, జి.చిన్నమ్మ, రణదీప్ తదితరులు పాల్గొన్నారు.



## కామ్రేడ్ భాస్కర్ రెడ్డి కుటుంబానికి క్వింటా బియ్యం అందజేసిన సమ్మిగౌడ్ ఫౌండేషన్

### ప్రజల కోసం పోరాడిన నాయకుడి కుటుంబానికి తోడుగా నిలిచిన వ్యక్తి సమ్మిగౌడ్:సామల నర్సయ్య

### పార్టీలకతీతంగా సమ్మి గౌడ్ సేవలు అభినందనీయం:బండ్లపల్లి వెంకటేశ్వర్లు



**కేసముద్రం, మే 29(నంది పత్రిక):** కేసముద్రం మండల కేంద్రానికి చెందిన సిపిఐఎం న్యూడెమోక్రసీ నాయకుడు, భారత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ కన్మంత రెడ్డి భాస్కర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, తన స్వగ్రామం ఈదుల పూసపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, కార్మికుల హక్కుల సాధనలో నిరంతరం పోరాడిన భాస్కర్ రెడ్డి మరణం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. భాస్కర్ రెడ్డి కుటుంబ పరిస్థితిని పార్టీ జిల్లా నాయకుడు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య దృష్టికి తీసుకెళ్లగా, అందుబాటులో లేకపోయినా, విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి సమ్మిగౌడ్ ఫౌండేషన్ తరపున భాస్కర్ రెడ్డి కుటుంబానికి తక్షణ సహాయం కింద ఒక క్వింటాల్ బియ్యాన్ని పంపించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐఎం నాయకులు మాట్లాడుతూ, పార్టీలకతీతంగా ప్రజల కష్టసుఖాల్లో స్పందిస్తూ సహాయం చేయడం సమ్మిగౌడ్ ఫౌండేషన్ ప్రత్యేకత అన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు వెంటనే అండగా నిలవడం నిజమైన మానవత్వానికి నిదర్శనం. సమ్మి గౌడ్ చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగాలి నిలుస్తున్నాయని కొనియాడారు. పార్టీ జిల్లా నాయకుడు కామ్రేడ్ బండపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ నాయకుడు కామ్రేడ్ షేక్ మౌలానా పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com